ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 22.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 3 అనంతపురం

జిల్లా వార్తలు

శుక్రవారం 7 నవంబరు 2025

ఆటలకు అదిరే ఏర్పాట్లు



ఆర్డీటీ స్టేడియంలో ఏర్పాటు చేసిన భారీ వేదిక

నేటి నుంచి 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడోత్సవాలు

ఆర్డీటీ స్టేడియానికి చేరుకున్న 27 జట్లు



వేదిక వద్ద మాట్లాడుతున్న ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు జరిగే కార్యక్రమాలకు ఆర్డీటీ స్టేడియంలోని వేదికను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 27 జట్లు జిల్లాకు చేరుకున్నాయి. ఇందులో 26 జిల్లాల జట్లు, రెవెన్యూశాఖ రాష్ట్ర కార్యాలయం జట్టు ఉన్నాయి. మొత్తం 31 క్రీడాంశాలలో పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు. కళాకారులు స్టేడియంలో గురువారం రిహార్సల్స్ చేశారు. క్రీడల నిర్వహణను 16 కమిటీలు (మిగతా 4వ పేజీలో..)

నేడు కళ్యాణదుర్గానికి మంత్రి లోకేశ్

- రెండు రోజులు కార్యక్రమాల్లో పాల్గొననున్న యువనేత
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు, పార్టీ శ్రేణులు
- ఐదు వందలు పైబడిన వాహన శ్రేణితో స్వాగతానికి ఏర్పాట్లు





మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, పక్కన అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

కళ్యాణదుర్గం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కళ్యాణదుర్గం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయన శుక్రవారం సాయంత్రం కళ్యాణదుర్గం చేరుకోనున్నారు. అనంతరం నిర్వహించే కార్యక్రమంలో పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను గౌరవిస్తూ, అవార్డులు అందజేయనున్నారు. 8వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే కనకదాస జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొంటారు. కంబదూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన తొమ్మిది అడుగుల కనకదాస కాంస్య విగ్రహాన్ని మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో కంబదూరు రింగ్ రోడ్డు నుంచి వాల్మీకి సర్కిల్ వరకు ప్రధాన రహదారులన్నీ ముస్తాబు చేశారు. సుమారు 50 వేల మంది వరకు ఈ కార్యక్రమానికి విచ్చేస్తుండటంతో అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశారు. అలాగే 500పైబడిన (మిగతా 4వ పేజీలో..)

ADCA
అడ్డదారి క్రికెట్ అసోసియేషన్..!

- సెలెక్షన్స్‌లో ఇష్టారాజ్యం
- అకాడమీలు, ప్రైవేటు కోచ్‌ల హవా
- తమ వారి కోసం స్కోర్లను మార్చేస్తున్న వైనం
- ప్రతిభావంతులకు అన్యాయం



సెలెక్షన్స్ వద్ద బయటి వ్యక్తులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా క్రికెట్ సంఘం (ఏడీసీఏ) కాస్తా.. అడ్డదారి క్రికెట్ సంఘంగా మారిపోయింది. అందులో అన్నీ అక్రమాలే అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్రికెటర్ల సెలెక్షన్స్‌లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నారు. సెలెక్షన్స్‌లో అకాడమీలు, కోచ్‌ల హవా నడుస్తున్నట్లు తెలుస్తోంది. సిఫార్సులకు అనుగుణంగా ఏకంగా సెలెక్షన్ మ్యాచ్‌ల స్కోర్లనే మార్చేస్తున్నారన్న ఆరోపణలు బాధిత క్రికెటర్ల తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి. క్రికెట్‌తో సంబంధంలేని వ్యక్తులకు అసోసియేషన్‌లో అవకాశం కల్పిస్తుండడం శోచనీయం. అవినీతి ఆరోపణలతో వారిని తొలగిస్తున్నా.. మళ్లీ అసోసియేషన్‌లో చోటు కల్పిస్తుండడం గమనార్హం.

పోటీని ఆసరాగా చేసుకుని..

క్రికెట్‌లో తీవ్ర పోటీ ఉంటుంది. దానిని దళసరాగా చేసుకుని కొందరు క్రికెట్‌ను వ్యాపారంగా మార్చేస్తున్నారు. సెలెక్షన్లలో క్రికెటర్ల ప్రతిభ ఆధారంగా జట్టులోకి ఎంపిక చేస్తారు. ప్రాబబుల్స్‌లో జరిపే మ్యాచ్‌లలో స్కోరు బోర్డులనే మార్చేస్తున్నారు. తమకు అనుకూలంగా ఉండే పిల్లల స్కోర్లను పెంచేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన అండర్-14 జిల్లా బాలుర క్రికెట్ (మిగతా 4వ పేజీలో..)

వెలలేని గెల..!
అరటి ధర పాతాళానికి..! వ్యాపారుల సిండికేట్

- టన్ను రూ.2వేలకే అడుగుతున్న వైనం
- ఆ ధరకూ కొనేవారు కరువు
- చెట్టుపైనే మాగిపోతున్న కాయలు
- కన్నీళ్లు పెట్టుకుంటున్న అన్నదాత



రాయలచెరువు వద్ద సాగుచేసిన అరటి పంట

యాడికి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సాగుచేసిన పంట చేతికొచ్చే సమయంలో ధర పతనం కావడంతో అరటి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మండలంలో రాయలచెరువు, పచ్చారుమేకలపల్లి, చందన, లక్షుంపల్లి, కేశవరాయునిపేట, దైవాలమడుగు, తూట్రాళ్లపల్లి, కొత్తపల్లి, నగరూరు గ్రామాల పరిధిలో సుమారు 2వేల ఎకరాల్లో అరటి సాగుచేశారు. ఎకరాలో పంట సాగుకు రూ.70వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేస్తున్నారు. దిగుబడి 15 నుంచి 20 టన్నుల వరకు వచ్చింది. ధరలు బాగుంటే లాభాలు వస్తాయని రైతులు భావించారు. నెల క్రితం వరకు టన్ను రూ20 వేలు పలికిన ధర ఒక్కసారిగా రూ.2 వేలకు పడిపోవడం గమనార్హం. ఈ ధరకు విక్రయిస్తే అరటి పంట కోత కూలీలు, రవాణా ఖర్చులు కూడా రావని రైతులు వాపోతున్నారు. ఆ ధరకు కొనేవారు కరువయ్యారు.

వ్యాపారుల సిండికేట్..

అరటి ధరలు పతనం కావడానికి అరబ్ దేశాలకు ఎగుమతులు తగ్గడమే కారణమని చెబుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని అరటి వ్యాపారులు సిండికేట్ అయి ధరలను మరింత తగ్గించేస్తున్నారని రైతులు వాపోతున్నారు. అరటి కొనుగోళ్లు చేసే వివిధ కంపెనీల ప్రతినిధులతోపాటు స్థానిక వ్యాపారులు ఇటీవల అనంతపురంలో రహస్య సమావేశం ఏర్పాటు చేసుకుని, ధరలపై సిండికేట్ అయ్యారని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. ఆ మేరకు ఇష్టారాజ్యంగా ధరలు ఈళ/నిర్ణయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టన్ను రూ.2వేల నుంచి మొదలు

ఎన్నడూలేనివిధంగా అరటిటన్ను రూ.2 వేల నుంచి వ్యాపారులు అడుగుతున్నారని గరిష్ఠంగా రూ.5వేలు మాత్రంగా ఉందని రైతులు తెలిపారు. ఇలాంటి పరిస్థితి కరోనా సమయంలో మాత్రమే ఎదురైందనీ, అప్పట్లో ఎగుమతులు పూర్తిగా నిలిచిపోవడంతో అరటి ధరలు పాతాళానికి పడిపోయాయనీ, కొనేవారే లేకపోయారని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం అరటి ధరలు కరోనా పరిస్థితులను తలపిస్తున్నాయని తెలిపారు. ధరలు ఇలాగే కొనసాగితే తాము తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా కృషిచేయాలని రైతులు కోరుతున్నారు.

లక్షలు పెట్టుబడులు పెట్టి.. నెలలపాటు కష్టపడి పండించిన పంటను అమ్ముకోలేక అరటి రైతు విలవిల్లాడుతున్నాడు. నెలక్రితం వరకు బాగున్న ధరలు ఒక్కసారిగా పాతాళానికి పడిపోయాయి. వ్యాపారులు సిండికేట్ అయి.. ఏకంగా టన్ను రూ.2వేలకు అడుగుతున్నారని అన్నదాతలు వాపోతున్నారు. ఆ ధరకే ఇద్దామనుకున్నా.. పంట కోసేందుకు రావట్లేదని వాపోతున్నారు. దీంతో చెట్లలోనే అరటి కాయలు మాగిపోతున్నాయి. దీంతో పంటను పూర్తిగా వదులుకోవాల్సిన దుస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు. ఇలాగైతే.. పెట్టుబడులకు చేసిన అప్పులు ఎలా తీర్చాలని కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.



అరటిచెట్టుపైనే మాగుతున్న కాయలు

70 ఎకరాల్లో అరటి సాగుచేశా



70ఎకరాల్లో అరటి సాగుచేశా. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టా. పంట దిగుబడి వచ్చిన సమయంలో ధరలు పూర్తిగా తగ్గిపోయాయి. వ్యాపారులు సిండికేట్ అయి పూర్తిగా ధరలు తగ్గించేశారు. అరటిని కొనడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో తోటల్లోని అరటికాయలు మాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పంటను కోల్పోయి రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

\- చరణ్, అరటిరైతు, రాయలచెరువు

ధరలు దారుణంగా పడిపోయాయి



పంట దిగుబడి వచ్చిన సమయంలో అరటిధరలు దారుణంగా పడిపోయాయి. వ్యాపారులు అరటి టన్ను రూ.2వేలకు అడుగుతున్నారు. వ్యాపారులు సిండికేట్ అయి రైతులను ముంచేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అరటి రైతులు తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తోంది.

\- శ్రీనివాసులు, రైతు, రాయలచెరువు

పారదర్శక ఓటరు జాబితానే లక్ష్యం

- వీసీలో చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్ యాదవ్
- ఎస్ఐఆర్‌పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించడమే లక్ష్యంగా రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్-2025)కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ తెలిపారు. దీనిపై గురువారం ఆయన రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ ఆనంద్, డీఆర్ఓ మలోల, ఎన్నికల సెక్షన్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -2025 కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. దీని ద్వారా అర్హత కలిగిన ప్రతి పౌరుడు తన పేరు ఓటరు జాబితాలో చేర్చుకునే అవకాశం పొందు తారన్నారు. మరణించినవారు, నివాసం మారిన వారు, పునావృత ఎంట్రీలు వంటి తప్పులను సరిదిద్దడం, ప్రతి బూత్‌లో ఓటరు జాబితా ఎస్ఐఆర్-2002 జాబితా మేరకు ఉందా లేదా అని పరిశీలిస్తారన్నారు. ఇందులో భాగంగా ఓటరు ఇంటి సందర్శన కూడా చేస్తారన్నారు. ఏదైనా తేడా ఉంటే అవసరం మేరకు ఫాం-6,7,8లను ఓటరుకు అందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బీఎల్ఓలకు సంబంధిత స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని, అందుకు త్వరలోనే శిక్షణా కార్యక్రమం ఉంటుందన్నారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేవారు ఫాం-6, మార్పులు/సవరణలు అవసరమైన వారు ఫాం-8 ద్వారా సమర్పించాలన్నారు. నివాసం మారినవారు లేదా మరణించిన వారి పేర్లు తొలగించడానికి ఫాం-7 ఉపయోగించాలన్నారు. ప్రాథమిక సర్వే పూర్తయిన అనంతరం, డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రదర్శిస్తారన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, ఎన్నికల సెక్షన్ డీటీ కనకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టాంపుల కొరత

- అందుబాటులో లేని నాన్ జ్యుడీషియల్ స్టాంపులు
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న స్టాంపు వెండర్లు
- ఈ-స్టాంప్‌లపై అదనపు బాదుడు

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్టాంపుల కొరత ఏర్పడింది. నాన్ జ్యుడీషియల్ స్టాంపులు ప్రస్తుతం అందుబాటులో లేకుండా పోయాయి. కేవలం ఒకటి, రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చాలా తక్కువ సంఖ్యలో అందుబాటులో ఉన్నాయి. దీంతో వాటికి డిమాండ్ ఏర్పడింది. గత వైసీపీ పాలనలో ఈ స్టాంపులు మాత్రమే అందుబాటులో ఉంచారు. నాన్ జ్యుడీషియల్ స్టాంపులను తీసుకురాలేదు. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం నాన్‌జ్యుడీషియల్ స్టాంపులను ప్రజలకు అందుబాటులో తెచ్చింది. అయితే తక్కువ మొత్తంలో వస్తుండటం, కొందరు స్టాంపు వెండర్లు కృత్రిమ కొరత సృష్టిస్తుండటంతో నాన్ జ్యుడీషియల్ స్టాంపులు అందుబాటులో లేకుండా పోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తక్కువ సంఖ్యలో...



జిల్లాకు చివరగా రూ.50లక్షల ముఖ విలువ కలిగిన నాన్ జ్యుడీషియల్ స్టాంపులు వచ్చాయి. అయితే మూడు నెలలు కూడా ముగియకముందే ఆ స్టాంపుల కొరత ఏర్పడింది. ఈ- స్టాంపులు అందుబాటులో ఉన్నా నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కోసమే ప్రజలు, క్రయ, విక్రయదారులు ఆసక్తి చూపుతున్నారు. కానీ జిల్లా కేంద్రానికి రూ.2.5కోట్ల నుంచి రూ.3కోట్ల ముఖ విలువ కలిగిన నాన్ జ్యుడీషియల్ స్టాంపులు వస్తేనే సరిపోతాయని రిజిస్ట్రేషన్ వర్గాలంటున్నాయి. అంటే జిల్లా మొత్తానికి రూ.5కోట్ల ముఖ విలువ కలిగిన స్టాంపులు అవసరం పడుతుందంటున్నారు. ఆ సంఖ్యలో వస్తే కనీసం ఆరు నెలల పాటు స్టాంపులు అవసరం ఉండకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కృత్రిమ కొరత

నాన్ జ్యుడీషియల్ స్టాంపుల విషయంలో స్టాంపు వెండర్లు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రంలో 50 మంది స్టాంపు వెండర్లు, మిగిలిన ప్రాంతాల్లో మరో 100మంది ఉన్నారు. వీరిలో కొందరు మహిళల పేర్లతో అనధికారికంగా, అధిక ధరలకు స్టాంపులు విక్రయిస్తున్నారని సమాచారం. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సాధారణంగా స్టాంపులు త్వరగా అమ్ముడవుతాయి. ఇలాంటి సందర్భాల్లో స్టాంపు వెండర్లు అధిక ధరలకు విక్రయిస్తుంటారు. స్టాంపులు అందుబాటులో లేవని సాకులు చెబుతూ సొమ్ము చేసుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ శాఖాధికారులు ఇప్పటికైనా కొరతపై విచారణ చేసి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

అదనపు బాదుడు

ఈ- స్టాంప్‌లపై అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రజల అవసరాలను వారు సొమ్ము చేసుకుంటున్నారు. విక్రయం ప్రైవేట్ వ్యక్తుల చేతిలో ఉండటంతో అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అనంతపురం రామ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని ఓ సెంటర్‌లో అదనంగా వసూలు చేస్తున్నా పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. వీరు ఇచ్చేది కూడా రూ.50లు, రూ.100ల స్టాంపులే. రూ.50ల ఈ స్టాంపుకు రూ.80లు, రూ.100ల స్టాంపుకు రూ.150ల వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని చోట్ల డిమాండ్‌ను బట్టి రూ.200లు కూడా వసూలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో వివిధ వర్గాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



వెంకటేష్‌గౌడ్ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్లపల్లిలో అప్పుల బాధతో రైతు వెంకటేష్‌గౌడ్ (30) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు వెంకటేష్ గౌడ్ తనకున్న ఐదు ఎకరాల పొలంలో వివిధ పంటల సాగు చేశాడు. నీటి వసతి కోసం రూ.15 లక్షలు అప్పులు చేసి దాదాపు 24 బోర్లు వేయించారు. కొన్ని బోర్లలో నీరు వస్తుండటంతో వాటితోనే టమోటా, కర్బూజా ఇతర పంటలను సాగు చేశాడు. దాదాపు ఆరు నెలల నుంచి బోరుబావులు ఎండిపోయి, నీరు రాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఈక్రమంలోనే ఊరికి సమీపంలోని మామిడి చెట్ల వద్దకు వెళ్లి తాడుతో ఉరి వేసుకున్నాడు. అటుగా వెళ్లిన గ్రామస్థులు ఉరికి వేలాడుతున్న వెంకటేష్‌గౌడ్‌ను చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య తేజస్విని, కుమారులు రుత్విక్, గగన్ ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హైవేపై ఆపితే.. సైరన్ మోగుద్ది..!
లేజర్ సెన్సర్ నిఘా ఏర్పాటుకు చర్యలు

- అన్ విజిబుల్ లేజర్ రేస్‌తో పసిగట్టే పరికరాలు

- రెండు నిముషాలు దాటితే సైరన్
- పోలీసులు, ఉన్నతాధికారులకు సమాచారం
- జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలుకు అడుగులు (వివరాలు 4వ పేజీలో)

బంగారంలాంటి మనిషి..!

- 12 తులాల ఆభరణాలను అప్పగించిన ఆటో డ్రైవర్
- ఘనంగా సత్కరించిన డీఎస్పీ శ్రీనివాసులు



ఆటో డ్రైవర్‌కు డీఎస్పీ సత్కారం.. ప్రయాణికులకు ఆభరణాల అప్పగింత

అనంతపురం క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణికులు మరిచిపోయిన బంగారం ఆభరణాలను పోలీసులకు అప్పగించి, నిజాయతీని చాటుకున్నారు ఆటో డ్రైవర్ చంద్రశేఖర్. పోలీసులు బాధితులను గుర్తించి, స్టేషన్‌కు పిలిపించి ఆభరణాలను అప్పగించారు. వారి సమక్షంలో చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఈ సంఘటన చోటు చేసుకుంది. నంద్యాలకు చెందిన లక్ష్మీబాయి, సుబ్రహ్మణ్యం రావు దంపతులు తమ కుమారుడు ఉమేష్ చంద్రతో కలసి గురువారం మధ్యాహ్నం అనంతపురం నగరానికి వచ్చారు. పాతూరు తాడిపత్రి బస్టాండ్ ప్రాంతంలో బస్సు దిగి ఆటో ఎక్కారు. బంధువుల పెళ్లి ఉండటంతో మారుతీ నగర్‌లో హడావుడిగా దిగిపోయారు. కానీ ఆటోలో బంగారం ఆభరణాలున్న సంచిని మరిచిపోయారు. వారు దిగగానే ఆటో డ్రైవర్ వెనుదిరిగారు. పెద్దాసుపత్రి వద్దకు వెళ్లాక ఆటోలో బ్యాగు ఉన్నట్లు గుర్తించి, ప్రయాణికులు దిగిన చోటుకు వెళ్లి గాలించారు. వారు కనిపించకపోవడంతో నేరుగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, బ్యాగ్ పోలీసులకు అప్పగించారు. అందులో బంగారం హారం, జత కమ్మలు, రెండు బంగారం గాజులు.. మొత్తం 12 తులాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందిని పురమాయించి, ఆభరణాలను మరిచిపోయినవారి ఆచూకీని కనిపెట్టారు. వారిని స్టేషన్‌కు పిలిపించి, ఆభరణాలను అప్పగించారు. నిజాయతీగా వ్యవహరించిన భవానీ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ చంద్రశేఖర్‌ను అనంతపురం రూరల్ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. చంద్రశేఖర్‌ను డీఎస్పీ అభినందించారు. లక్ష్మీబాయి కుటుంబం ఆయనకు చేతులెత్తి నమస్కరించి.. కృతజ్ఞతలు తెలిపింది.

ADCA అడ్డదారి క్రికెట్ అసోసియేషన్..!



జిల్లా క్రికెట్ సంఘం (ఏడీసీఏ)

(3వ పేజీ తరువాయి)
జట్టు ఎంపిక మ్యాచ్‌లో ఓ క్రికెటర్ 57 పరుగులు చేస్తే.. 31 మాత్రమే చేసినట్లు మార్చేశారట. మరో క్రికెటర్ 39 పరుగులు చేయగా.. 71గా మార్చి జట్టులోకి ఎంపిక చేయడం గమనార్హం. ఓ బౌలర్ 6 వికెట్లు తీయగా.. 2గా మార్చేసినట్లు తెలుస్తోంది. ఓ బాలుడు వికెట్ మాత్రమే తీయగా.. 5 పడగొట్టినట్లు మార్చడంతో వివాదం తలెత్తింది. ప్రాబబుల్స్ సెలెక్షన్స్ మ్యాచ్‌లో, నెట్ సెలెక్షన్స్‌లో బయటి వ్యక్తులను లోపలికి అనుమతించడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జనన ధృవీకరణ పత్రాలు సక్రమంగా ఉండి, అర్హత, ప్రతిభగల క్రికెటర్లకు అన్యాయం చేస్తున్నారని పలుమార్లు బాధిత చిన్నారుల తల్లిదండ్రులు.. ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ), బీసీసీఐకి ఫిర్యాదులు చేశారు. అయినా క్రికెట్ సంఘంలో మార్పు రావట్లేదు.

ప్రైవేటు వ్యక్తుల జోక్యం

సెలెక్షన్స్, మ్యాచ్‌ల సమయంలో క్రికెట్ సంఘానికి సంబంధంలేని బయటి వ్యక్తులు జోక్యం మితిమీరుతోంది. దీంతో ప్రతిభగల వారికి తీరని అన్యాయం వాటిల్లుతోందనే చర్చ సాగుతోంది. సంఘంలోని సభ్యుల కంటే బయటి వ్యక్తుల హడావుడి, ప్రదర్శనలు అధికమవుతున్నాయి. సెలెక్షన్స్, మ్యాచ్‌ల సమయంలో అకాడమీల నిర్వాహకులు, కోచ్‌ల ప్రమేయం ఉండకూడదనేది బీసీసీఐ నిబంధన. అందుకు విరుద్ధంగా జిల్లాలో అకాడమీలు, ప్రైవేటు కోచ్‌ల హడావుడి కనిపిస్తోంది. సామాన్య క్రికెటర్లకు అన్యాయం వాటిల్లుతోందని వారి తల్లిదండ్రులు చెబుతున్నారు.

సిఫారసులకు పెద్దపీట

క్రికెటర్ల ఎంపికలో సిఫారసులకే పెద్దపీట వేస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. ఎక్కువగా నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో శిక్షణ పొందుతున్న వారికే ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. కోచ్‌గా ఉంటున్న ఓ వ్యక్తి జిల్లా క్రికెట్ సంఘంలో తన రాజకీయ పలుకుబడితో చక్రం తిప్పుతున్నారనే చర్చ సాగుతోంది. తమ వద్ద కోచింగ్ తీసుకునే వారికి జట్టులోకి ఎంపిక చేస్తామని మభ్యపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ కోచ్‌ను పలు ఆరోపణలతో పీటీసీ నుంచి తొలగించారు. తన పరపతితో తిరిగి అక్కడికే రావడం పట్ల అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆ కోచ్‌కు అనుకూలమైన వారినే జట్టుకు సిఫారసు చేస్తున్నారని బాధిత క్రికెటర్ల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ప్రక్షాళన చేసేరా?

ఉమ్మడి జిల్లా క్రికెట్ సంఘం పదవీ కాలం ఈ నెలతో ముగియనుంది. వెంటనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. నెలాఖరులోపు ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని ఇప్పటికే బీసీసీఐ, ఆంధ్రా క్రికెట్ సంఘం నుంచి ఆదేశాలు అందినట్లు సమాచారం. గతంలో జిల్లా కార్యదర్శిగా పనిచేసి పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న అభ్యర్థులే తిరిగి సెక్రటరీ, ప్రెసిడెంట్ పదవుల కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. క్రికెట్‌కు సంబంధం లేని వ్యక్తి గతంలో ఏడీసీఏలో పనిచేశాడు. పలు ఆరోపణలతో అతడిని తొలగించారు. అదే వ్యక్తిని ఆరు నెలల క్రితం ఏడీసీఏలోకి తీసుకోవడం శోచనీయం. ఎన్ని అవినీతి ఆరోపణలు ఉన్నా.. తమ వారైతే చాలు అన్నట్లుగా వ్యవహారం సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా అడ్డదారుల్లో క్రికెట్‌తో సంబంధంలేని వ్యక్తుల ప్రమేయం అధికమవుతుండడంతోనే సెలెక్షన్స్‌లో అవకతవకలు జరుగుతున్నాయనే విమర్శలు వినవస్తున్నాయి. బీసీసీఐ, ఏసీఏ దృష్టి సారించి జిల్లా క్రికెట్ సంఘాన్ని ప్రక్షాళన చేయాలని క్రికెట్ అభిమానులు కోరుతున్నారు.

పారదర్శకంగా సెలెక్షన్స్

జిల్లా క్రికెట్ జట్టు సెలెక్షన్స్ పారదర్శకంగా నిర్వహించాం. ఇందులో ఇతరుల ప్రమేయం ఉండదు. ప్రతిభ ఆధారంగా తుది జట్టుకు ఎంపిక చేస్తారు. స్కోరు వివరాల నమోదు బహిరంగంగానే సాగుతుంది. ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేస్తారు. మార్చే అవకాశం ఉండదు. జిల్లా క్రికెట్ సంఘం ఎన్నికలపై చర్చిస్తున్నాం.

- జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గురువారం తెల్లవారుజామున ఏసీబీ అధికారులు

కొనసాగిన ఏసీబీ తనిఖీలు

- బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం ఉదయం వరకూ..

చిలమత్తూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండోరోజు గురువారం కూడా ఏసీబీ సోదాలు కొనసాగాయి. ఏసీబీ అధికారులు హమీద్‌ఖాన్, జయమ్మ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం 1 గంట నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు తనిఖీలు చేశారు. సబ్‌రిజిస్ట్రార్ ప్రసాద్‌తో పాటు కార్యాలయంలో పనిచేసే ప్రైవేటువ్యక్తులు, మరికొందరు దస్తావేజు లేఖరులను వారితో పాటు కార్యాలయంలో ఉంచుకొని రికార్డులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రూ.4060 పట్టుబడగా దాన్ని సీజ్ చేశారు. కార్యాలయంలో పనిచేసే ఓ ప్రైవేటు వ్యక్తి ఫోన్ పే ద్వారా పెద్ద ఎత్తున నగదు లావాదేవీలు జరగడంతో దానిపై ఆరా తీశారు. ఎందుకు అంత పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరిగాయి? సబ్‌రిజిస్ట్రార్‌కి ఈ నగదు వెళ్లిందా? అని ప్రశ్నించినట్లు సమాచారం. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం వారికి కావాల్సిన కొన్ని ముఖ్యమైన అంశాలున్న ఫైళ్లను వెంట తీసుకెళ్లారు.

టీడీపీ సీనియర్ నాయకుడు

గాలివేటి శ్రీరాములు నాయుడు మృతి



గాలివేటి శ్రీరాములు నాయుడు, నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

నల్లచెరువు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కదిరి నియోజకవర్గ నాయకుడు గాలివేటి కృష్ణమోహన్ నాయుడు తండ్రి, పార్టీ సీనియర్ నాయకుడు గాలివేటి శ్రీరాములు నాయుడు(77) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. ఆయన కదిరిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతితో నల్లచెరువు మండలంలో విషాదం అలుముకుంది. ఆయన అంత్యక్రియలను శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు స్వగ్రామం చిన్నయల్లంపల్లిలో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలియగానే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ నాయకులు సతీష్ చౌదరి, నాగరాజు, గుత్తా ప్రసాద్, దేవేంద్ర గౌడ్ తదితరులు నివాళులు అర్పించారు.

స్వయం ఉపాధి శిక్షణ

కొత్తచెరువు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మహిళలకు స్వయం ఉపాధిపై 14 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మండల కేంద్రంలోని ప్రభాత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదివిన 19 నుంచి 45 ఏళ్లలోపు మహిళలకు శిక్షణ ఇస్తామన్నారు. జూట్, కూరగాయల బ్యాగుల తయారీలో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణకు వచ్చే మహిళలు ఆధార్, రేషన్‌కార్డులు, బ్యాంకు ఖాతా పాసుపుస్తకం, పదో తరగతి విద్యార్హత పత్రం, మూడు ఫొటోలు తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పది ఉత్తీర్ణులైన 19 నుంచి 45 ఏళ్లలోపు పురుషులకు వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీలో నెల రోజులు శిక్షణ ఇస్తామన్నారు. పుట్టపర్తి మండలంలోని బ్రాహ్మణపల్లిలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. వసతితో పాటు భోజనం అందజేస్తామన్నారు.

జిల్లా హాకీ జట్ల ఎంపిక



ఎంపికైన జిల్లా హాకీ బాలురు, బాలికల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ జిల్లా అండర్-14 బాల, బాలికల హాకీ జట్లు ఎంపిక చేశారు. గురువారం స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. జట్ల వివరాలను ఎస్‌జీఎఫ్ ఇరు జిల్లాల కార్యదర్శులు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ ప్రకటించారు. బాలుర జట్టుకు వంశీ, బాలాజీ, బన్సారుద్దీన్, జస్వంత్, మోహిత్‌నాయక్, ఉపేంద్ర, తిరుమలేష్, వినయ్, గణేష్, రిత్విక్, మురారి, శశి, నగేష్, రామ్‌చరణ్ ఎంపికయ్యారు. బాలికల జట్టులో అనిత, వీణ, మనీషా, శిల్ప, నిత్యశ్రీ, అనన్య, హర్షిణి, ఉష, గీత, పూజ, హేమలత, వర్షిత, రుషిత, సుదీప, దీప్తి, సుమిత్ర చోటు దక్కించుకున్నారు. ఎంపికైన జట్లు నెలాఖరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు శకుంతల, సుహాసిని, శ్రీధర్, రమేష్, సురేష్, ప్రభాకర్, శాంతలింగం, నిర్మల, మల్లికార్జున, లోకేశ్వరి పాల్గొన్నారు.

నేడు కళ్యాణదుర్గానికి

మంత్రి లోకేశ్

(3వ పేజీ తరువాయి)
వాహన శ్రేణితో మంత్రి లోకేశ్‌కు వడ్డుపల్లి టోల్‌ప్లాజా వద్ద స్వాగతం పలకనున్నారు. అనంతరం ర్యాలీగా కళ్యాణదుర్గం టీడీపీ కార్యాలయం చేరుకోనున్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, పార్టీ పరిశీలకులు నాగేశ్వరయాదవ్‌తో పాటు డివిజన్ స్థాయి అధికారులంతా సభావేదిక ఏర్పాట్లు, శెట్టూరు రోడ్డులో మంత్రి నారా లోకేశ్ శుక్రవారం రాత్రి బస చేసే ప్రాంతాన్ని పరిశీలించారు.

వివాదాలకు తావులేకుండా డీఎస్సీ నిర్వహణ

ఎటువంటి వివాదాలకు తావు లేకుండా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసి, అర్హులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు అందించిన ఘనత మంత్రి నారా లోకేశ్‌కే దక్కుతుందని ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కొనియాడారు. కళ్యాణదుర్గంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీట్లు లేవని బోర్డులు పెట్టే స్థాయికి ప్రభుత్వ పాఠశాలలను తీసుకెళ్లడానికి మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని వెల్లడించారు. ఇప్పటికే పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో 1500 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వడంతో అక్కడ సీట్లు లేవని బోర్డు పెట్టారన్నారు. ఇలాంటి పరిస్థితి రాష్ట్ర వ్యాప్తంగా రావాలనే భావనతో మంత్రి లోకేశ్ పని చేస్తున్నట్లు తెలిపారు.



ఆర్డీటీ స్టేడియం ముఖద్వారం వద్ద భారీగా ఫ్లెక్సీలు


ఆర్డీటీ స్టేడియం లోపల ఏర్పాట్లు

ఆటలకు అదిరే ఏర్పాట్లు


రెవెన్యూ క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్

(3వ పేజీ తరువాయి)
పర్యవేక్షిస్తున్నాయి. సుమారు 3వేల మందికి వసతి, భోజనం ఏర్పాటు చేశారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. మంత్రులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు హాజరవుతారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు భాగస్వాములవుతారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరవుతారు.

ఘనంగా నిర్వహిస్తాం: బొప్పరాజు

రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుతో కలిసి జాయింట్ కలెక్టర్ శివ నారాయణస్వామి 27జట్ల క్రీడాకారులకు స్వాగతం పలికారు. రిహార్సల్స్‌ను తిలకించారు. ఈ సందర్భంగా జేసీ, బొప్పరాజు మాట్లాడుతూ, అతిథులతో పాటు 27 జట్ల క్రీడాకారులకు ఆర్డీటీ స్టేడియంలో ఏర్పాట్లు చేశామని తెలిపారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు క్రీడోత్సవాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. మును పెన్నడూ జరపని రీతిలో అంగరంగ వైభవంగా, సమష్టిగా క్రీడలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల, అహుడా సెక్రటరీ రామకృష్ణా రెడ్డి, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట రాజేష్, ఆర్డీఓలు కేశవనాయుడు, శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, మల్లి కార్జునరెడ్డి, రామ్మోహన్, మల్లికార్జున, రమేష్‌రెడ్డి, తిప్పేనాయక్, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దివాకర్‌బాబు, సోమశేఖర్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు మధునాయక్, మీడియా ఇన్‌చార్జి మునివేలు, డీఎస్‌డీఓ మంజుల, స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సంజీవరెడ్డి, హరిప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఉద్యోగుల ఉత్సాహం..

హైవేపై ఆపితే..

లేజర్ సెన్సర్ నిఘా ఏర్పాటుకు చర్యలు

సైరన్ మోగుద్ది..!

- అన్ విజిబుల్ లేజర్ రేస్‌తో పసిగట్టే పరికరాలు
- రెండు నిముషాలు దాటితే సైరన్
- పోలీసులు, ఉన్నతాధికారులకు సమాచారం
- జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలుకు అడుగులు


రాప్తాడు వద్ద పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు, సంస్థ ప్రతినిధి

రహదారి అద్భుతంగా ఉంటుంది. రాత్రిళ్లు పెద్దగా ట్రాఫిక్ ఉండదు. అతివేగంతో వాహనాలు వెళ్తుంటాయి. ఆ సమయంలో దగ్గరకు వెళ్లాక రోడ్డుపై ఆపిన వాహనం కనిపిస్తుంది. నేరుగా వెళ్లి ఢీకొడుతున్నారు. తప్పించేందుకు పక్కకు తిప్పితే బోల్తా ప్రమాదం ఉంటుంది. ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ప్రయాణికులతో వెళ్లే బస్సులు ఢీకొంటే పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. నిద్రపోతున్న వారు నిద్రలోనే మరణిస్తున్నారు. బైక్‌లు, ఆటోలు, లారీలు ఢీకొని పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇందుకు ప్రధాన కారణం రోడ్డుపై వాహనాలు ఆపడమే. ఈ తరహా ప్రమాదాలను అరికట్టాలంటే రోడ్డుపై వాహనాలు ఆపకుండా చూడడమే మార్గమని పోలీసు శాఖ భావిస్తోంది. ఆ దిశగా జిల్లా పోలీసులు తొలిసారి అడుగులు వేస్తున్నారు. ఓ ప్రైవేటు సంస్థతో కలిసి జిల్లాలో ప్రధానమైన 44వ నంబరు జాతీయ రహదారిపై లేజర్ సెన్సర్ సిస్టం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. ఇకపై రోడ్డుపై వాహనాలు ఆపితే వెంటనే సైరన్ మోగుతుంది. తర్వాత పోలీసులు, ఉన్నతాధికారులకు సైతం అలర్ట్ వెళ్తుంది. సంబంధిత పోలీసులు ఆపిన వాహనం వద్దకు చేరుకుని, అక్కడి నుంచి పంపించేస్తారు. ఇలాంటి సిస్టంను జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేయనున్నారు.

అనంతపురం క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై, పక్కన పార్కింగ్ చేసిన వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగి పలువురు చనిపోతుంటారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినపుడు రోడ్ల పక్కన నిలిపి ఉంచిన వాహనాలను వెంటనే గుర్తించి, అక్కడి నుంచి వెళ్లిపోయేలా చేస్తే.. ప్రమాదం జరిగేది కాదు అనుకుంటుంటాం. ఆ దిశగా పోలీసు శాఖ అడుగులు వేస్తోంది. కేవై సొల్యూషన్స్ సంస్థతో కలిసి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు సరికొత్త పరికరాల ఏర్పాటుకు సిద్ధమవుతోంది. రోడ్లపై ఆగి ఉన్న వాహనాలను లేజర్ సెన్సర్ ద్వారా గుర్తించే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలులోకి తీసుకురానుంది.

ప్రమాద ప్రాంతాల గుర్తింపు

జిల్లా పోలీసు శాఖ.. కేవై సొల్యూషన్స్ సంస్థతో కలసి యాంటీ పార్కింగ్ లేజర్ సెక్యూరిటీ సిస్టం పరికరాలను రహదారుల వద్ద అమర్చుతారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. వాటి లేజర్ సిగ్నల్స్ ఆధారంగా వాహనాలను గుర్తిస్తారు. ఎక్కడైనా రోడ్డుపై లారీలు, కంటైనర్లు ఇతర వాహనాలు నిలిపి ఉంచినా.. కదలకుండా అలాగే ఉన్నా.. లేజర్ సెన్సర్ కిరణాలు వాటిపై పడతాయి. వాటి ఆధారంగా సమాచారం క్షేత్రస్థాయిలోనే కాకుండా పోలీసు ఉన్నతాధికారులకు కూడా చేరుతుంది. తద్వారా వాటిని అక్కడి నుంచి పంపించే అవకాశం ఉంటుంది. దీంతో ప్రయోగాత్మకంగా వీటి ఏర్పాటుకు పోలీసు శాఖ పరిశీలిస్తోంది. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు, డీటీఆర్బీ సీఐ విజయభాస్కర్, రాప్తాడు సీఐ హర్ష, కేవై సొల్యూషన్స్ ప్రతినిధి శ్రీధర్.. 44వ జాతీయ రహదారిపై జిల్లా కేంద్రంలోని తపోవనం సర్కిల్, హైదరాబాద్ చాయ్ వద్ద, రాప్తాడు జంక్షన్ తదితర ప్రాంతాలను పరిశీలించారు.

వెంటనే సమాచారం


తపోవనం సర్కిల్‌లో పరిశీలిస్తున్న సీఐలు, సంస్థ ప్రతినిధి

యాంటీ పార్కింగ్ లేజర్ సెక్యూరిటీ సిస్టం పరికరాలు ఏర్పాటుచేసిన సర్కిల్ లోగానీ, ప్రాంతంలోగానీ వాహనాలు పార్కింగ్ చేస్తే వెంటనే లేజర్ సెన్సర్ కిరణాలు వాటిపై పడతాయి. ఫీల్డ్ అలర్ట్ వస్తుంది. 2 నిముషాల కన్నా ఎక్కువ సేపు పార్కింగ్ చేస్తే వెంటనే వాయిస్ అలర్ట్ వస్తుంది. పోలీసు సైరన్ కూడా మోగుతుంది. ఆ ఏరియాకు సంబంధించిన పోలీసు అధికారులు సుమారు ఐదుగురికి ఎస్ఎంఎస్‌లు, ఫోన్ కాల్స్ రూపంలో సమాచారం వెళ్తుంది. స్థానికంగా ఫీల్డ్ అలర్ట్ రావడంతో ఆ ప్రదేశానికి చేరుకున్న (ప్రయాణం చేసే వారికి) వాహన చోదకులు అప్రమత్తం అయ్యే అవకాశం ఉంటుంది. పోలీసులకు సమాచారం వెళ్లిన వెంటనే.. అధికారులు అప్రమత్తమై పార్కింగ్ చేసిన వారిని అలర్ట్ చేస్తారు. తద్వారా వాహనాన్ని అక్కడి నుంచి పంపించేసి, ప్రమాదాలను అరికట్టే అవకాశం ఉంటుంది.

ఆశలు కంది పాయె..!

- రసం పీల్చే వైరస్‌తో ఏర్పడిన గొడ్డు చెట్లు
- పూత, కాయలు కాసే పరిస్థితి మృగ్యం
- మరికొన్ని పొలాల్లో కాయపుచ్చు తెగులు
- ప్రశ్నార్థకంగా కంది దిగుబడి
- ఆందోళనలో రైతులు

అనంతపురం అర్బన్/బెళుగుప్ప, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది దిగుబడి ప్రశ్నార్థకంగా మారింది. వేరుశనగలో ఎక్కువ నష్టాలు వస్తుండటంతో ఈఏడాది అనేకమంది రైతులు ప్రత్యామ్నాయంగా కందిని సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 3.5 లక్షల ఎకరాలకుపైగా భూమిలో వర్షాధారం కింద కంది పంట సాగైంది. పైరు ఏపుగా పెరిగినా చీడపీడలతో దిగుబడిపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రసం పీల్చే వైరస్ సోకడంతో గొడ్డు చెట్లు ఏర్పడ్డాయి. మరికొన్ని చోట్ల మారుక మచ్చల పురుగు ఆశించడంతో పంట దిగుబడి ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో కంది రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

గొడ్డు చెట్లు దర్శనం

ఈ ఏడాది జూన్, జూలై మాసంలో సాగు చేసిన కంది పంట ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. పంట శాకీయ దశలో ఉన్న సమయం సెప్టెంబరు నుంచి అక్టోబరు మధ్యలో సరైన వర్షాలు పడలేదు. వాతావరణం కూడా వేడిగా ఉండటంతో రసం పీల్చే వైరస్ సోకింది. దీంతో కంది మొక్కలు పూత పూయని గొడ్డు దశకు చేరాయి. వీటి వల్ల రైతులకు తీవ్ర నష్టం ఏర్పడింది. అలాగే మారుక గూడు పురుగు సోకడంతో కాయపుచ్చు ఏర్పడింది. ఈ పురుగు సోకడంతో మొక్కల్లో ఎదుగుదల లోపించింది. ఈ పురుగు లేత ఆకులు, అప్పుడే ఏర్పడిన పూత మీద గుడ్లను పెడుతుంది. గుడ్ల నుంచి పొదిగిన లార్వాలు ఆకులు, పూతను గూడుగా చేసుకొని, అందులో ఉన్న పచ్చదనాన్ని తింటాయి. తద్వారా పూత రాలిపోతుంది. కాయ ఎదుగుదల లోపిస్తుంది. ఈ పురుగు సోకిన కంది పంట దిగుబడి ప్రశ్నార్థకంగా మారింది.


బెళుగుప్ప మండలంలో కంది పంట


బెళుగుప్ప మండలంలో కంది గొడ్డుచెట్లు

దిగుబడి కష్టమే



ఈ సారి ఖరీఫ్‌లో 28 ఎకరాల్లో కంది పంట సాగు చేశా. మారుక గూడు పురుగు సోకడంతో కాయపుచ్చు ఏర్పడింది. దీంతో పూత రాలిపోతోంది. మరికొన్ని చెట్లకు రసం పీల్చే వైరస్ సోకడంతో గొడ్డు చెట్లు ఏర్పడ్డాయి. తద్వారా దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. వేరుశనగ సాగుతో నష్టపోయి కంది పంటను సాగు చేశా. అయితే తెగుళ్లు సోకవడంతో కంది పంట దిగుబడి కూడా వస్తుందో..? రాదో తెలియని పరిస్థితి ఏర్పడింది.

-రైతు శ్రీరాములు, ఆవులెన్న, బెళుగుప్ప మండలం

పూత రాలిపోతోంది



నేను 10 ఎకరాల్లో కంది పంట సాగు చేశా. తెగుళ్ల సోకడంతో కంది పంటలో పూత రాలిపోతోంది. దీనికితోడు వర్షాలు పడుతుండటంతోతెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేయలేకపోతున్నాం. ఆకాశం ముసురుగా ఉండటంతో తెగుళ్ల ఉధృతి కూడా పెరిగింది. వేరుశనగలో నష్టాలు వస్తున్నాయని కంది సాగు చేస్తే ఇందులో కూడా నష్టాలే మిగిలేలా ఉన్నాయి.

-రైతు వెంకటేశులు, నక్కలపల్లి, బెళుగుప్ప మండలం

సస్యరక్షణ చర్యలు అవసరం



ఈ సారి ఖరీఫ్‌లో సాగైన పంటలో ఎక్కువ శాతం రసం పీల్చే నల్లి ద్వారా వైరస్ సోకడంతో గొడ్డు చెట్లు ఏర్పడ్డాయి. పలు ప్రాంతాల్లో కందికి మారుక గూడు పురుగు సోకడంతో కాయపుచ్చు ఏర్పడింది. దీంతో కంది పూత రాలిపోతోంది. కాయ ఎదుగుదల కనిపించడం లేదు. పొలంలో ఇతర కంది మొక్కలకు ఈ తెగుళ్ల వ్యాప్తి చెందకుండా తగిన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. ఈ తెగుళ్ల నివారణ కోసం 80 గ్రాములు ఇమామెక్టిన్ బెంజోయేట్ , 80 మి.లీల క్లోరాంట్రానిల్లిప్రోల్‌లను పిచికారీ చేసుకోవాలి.

-చంద్రాయుడు, కేవీకే శాస్త్రవేత్త, కళ్యాణదుర్గం

యాప్ ద్వారానే మద్యం అమ్మాలి

ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య

అనంతపురం క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలు, బార్లలో సురక్ష యాప్ ద్వారానే మద్యం అమ్మాలని, యాప్ వాడకుండా ఒక్క బాటిల్ అమ్మినా కఠిన చర్యలు తప్పవని ఉమ్మడి జిల్లా డీసీ నాగమద్దయ్య హెచ్చరించారు. అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో గురువారం ఆయన అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎక్సైజ్ సీఐలు, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఈఎస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలతో సమావేశం నిర్వహించారు. మద్యం నాణ్యత కనుక్కోడానికి ప్రభుత్వం సురక్ష యాప్ తీసుకొచ్చిందన్నారు. దీన్ని ప్రతి వినియోగదారుడు వాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. యాప్ వాడకుండా ఎవరూ లిక్కర్ షాపులు, బార్లలో సేల్స్ చేయకూడదని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని స్టేషన్ల పరిధిలో బెల్ట్ దుకాణాలు లేకుండా నియంత్రించాలన్నారు. పల్లెల్లో నాటుసారా, కల్తీ కల్లుపై కూడా గట్టి నిఘా పెట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవింద్ నాయక్, అసిస్టెంట్ ఈఎస్‌లు రేవతి, నరసింహులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైస్ సూపరింటెండెంట్ శ్రీరామ్, ఇతర సీఐలు సీఐలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతుల బోరు బావులకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ శ్రీనివాసరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ ప్రాజెక్టు కింద ఉమ్మడి జిల్లా ఎస్టీ రైతులకు రూ29.72 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. బోరుబావికి విద్యుత్‌సౌకర్యం కోసం ఇప్పటికే కొందరు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సౌకర్యం అవసరమైన రైతులు ఈనెల 28లోగా అనంతపురం గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో వివరాలతో అర్జీలను అందజేయాలని డీడీ కోరారు.

రెవెన్యూ క్రీడలకు రూ.5 లక్షల విరాళం



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న ఉమర్ ముక్తార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్ఎస్ఏ) ఆధ్వర్యంలో ఈ నెల 7,8,9 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు టీడీపీ నూర్ బాషా దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధికారి ప్రతినిధి డాక్టర్ ఉమర్‌ముక్తార్ రూ.5 లక్షల విరాళం అందజేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను కలిసి రూ.5 లక్షల చెక్కు అందజేశారు. ఉమర్ మాట్లాడుతూ ఇలాంటి క్రీడాపోటీలు అధికారుల మధ్య ఐకమత్యాన్ని, ఆరోగ్యాన్ని, సేవాభావాన్ని పెంపొందిస్తాయన్నారు.

సమస్యల పరిష్కారానికే స్పెషల్ గ్రీవెన్స్

అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): అనంతపురం-హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థ (అహుడా) పరిధిలో సమస్యల పరిష్కారానికే స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు చైర్మన్ టీసీ వరుణ్ తెలిపారు. స్థానిక అహుడా కార్యాలయంలో గురువారం స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహించారు. అహుడా వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మతో కలిసి అర్జీలను స్వీకరించిన అనంతరం చైర్మన్ టీసీ వరుణ్ మాట్లాడారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించిన అర్జీలను ఇవ్వొద్దని సూచించారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, నివేదిక అందజేయాలని అహుడా అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అహుడా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, ఏపీఓ హరీష్‌చౌదరి, ఈఈ దుశ్యంత్, డీఈలు జ్యోతి, రేవంత్ పాల్గొన్నారు.

గుప్తనిధుల వేటగాళ్ల పట్టివేత



గుప్త నిధుల వేటకు వచ్చి దొరికిపోయిన దిలీప్ రెడ్డి, శశికుమార్, శ్రీధర్

నంబులపూలకుంట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పురాతన నరసింహ స్వామి ఆలయంలో గుప్త నిధుల తవ్వకాలకోసం వచ్చిన ముగ్గురిని స్థానికులు గురువారం రాత్రి పట్టుకున్నారు. నంబులపూలకుంట మండలం ధనియాన్‌చెరువు పంచాయతీ డి.గొల్లపల్లి సమీపంలో పురానాతన నరసింహస్వామి ఆలయం ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం వద్ద రాత్రిపూట సంచరిస్తున్నట్లు రైతులు గుర్తించారు. ధనియాన్‌చెరువు, పాతూరు గ్రామాలకు ఈ సమాచారాన్ని చేరవేశారు. రెండు గ్రామాల ప్రజలు గురువారం రాత్రి ఆలయాన్ని చుట్టుముట్టారు. ఆలయం వద్ద ఒక ఆటో, ద్విచక్రవాహనం ఉన్నట్లు గుర్తించారు. గ్రామస్థుల రాకను పసిగట్టిన ముఠా పారిపోయేందుకు ప్రయత్నించిది. వీరిలో ఇద్దరిని ఆలయ సమీపంలో పట్టుకున్నారు. మరొకరిని వెంబడించి పొలాల్లో పట్టుకున్నారు. గ్రామస్థులు పట్టుబడినవారిని నిలదీయగా, తమది అన్నమయ్య జిల్లా మదనపల్లి అని, గుప్త నిధుల తవ్వకాల కోసం ఐదుగురం వచ్చామని ఒప్పుకున్నారు. పట్టుబడినవారిలో దిలీప్ రెడ్డి, శ్రీధర్, ఆటో డ్రైవర్ శశి కుమార్ ఉన్నారు. పారిపోయిన మహిళ, మరో వ్యక్తి కోసం గ్రామస్థులు పొలాలు, గుట్ట ప్రాంతాల్లో గాలిస్తున్నారు. పట్టుబడినవారిని పోలీసులకు అప్పగించారు.

నేడు ఫెన్సింగ్ సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఉమ్మడి జిల్లాస్థాయి ఫెన్సింగ్ సెలెక్షన్స్ బుధవారం స్థానిక కొవ్వూర్‌నగర్‌లోని విద్యారణ్య పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణ, కార్యదర్శి పుష్పావతి ప్రకటనలో తెలిపారు. సీనియర్ బాల, బాలికల విభాగంలో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఎంపికైన వారు ఈనెల 11వ తేదీన విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి, అర్హత గల వారు జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. వివరాలకు 9553768 295 నంబరులో సంప్రదించాలని కోరారు.

కూటమి పాలనలో అన్నివర్గాలకు మోసం

వైసీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో అన్ని వర్గాలకు మోసం జరుగుతోందని వైసీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి విమర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ ఎదుట కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమానికి బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటుపరం కాకూడదన్న లక్ష్యంతోనే కోటి సంతకాల సేకరణ చేస్తున్నామన్నారు. ధనార్జనే ధ్యేయంగా ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తున్నారన్నారు. పీపీపీ టెండర్లలో ఎవరు పాల్గొని దక్కించుకున్నా తాము అధికారంలోకి రాగానే వాటిని రద్దు చేస్తామన్నారు. అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ... వైద్యవిద్యను, సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని ప్రజలకు చేరువ చేయడం కోసం వైసీపీ హయాంలో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక తన వర్గానికి వాటిని కట్టబెట్టడానికి ప్రైవేటు పరం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, అనంత

చెన్నై-గుంతకల్లు మధ్య ప్రత్యేక రైలు



గుంతకల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చెన్నై సెంట్రల్-గుంతకల్లు మధ్య రెండు ట్రిప్పుల ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. చెన్నై సెంట్రల్-గుంతకల్లు (06091) ప్రత్యేక రైలు ఈ నెల 19, 21 తేదీల్లో రాత్రి 11-50 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2-15 గంటలకు గుంతకల్లుకు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (06092) ఈనెల 20, 22 తేదీల్లో సాయంత్రం ఐదున్నరకు గుంతకల్లులో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9-45 గంటలకు చెన్నై సెంట్రల్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు పెరంబూరు, తిరువల్లూరు, అరక్కోణం, కాట్పాడి, జోలార్‌పట్టి, కుప్పం, బంగారపేట్, వైట్‌ఫీల్డ్, క్రిష్ణరాజపురం, యల్హంక, హిందూపురం, శ్రీసత్యసాయి ప్రశాంతినిలయం, ధర్మవరం, అనంతపురం, గుత్తి స్టేషన్ల మీదుగా గుంతకల్లుకు చేరుతుందన్నారు. అలాగే తిరువనంతపురం నార్త్-శ్రీసత్యసాయి నిలయం మధ్య కూడా రెండు ట్రిప్పుల ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. తిరువనంతపురం నార్త్-శ్రీ సత్యసాయి నిలయం (06093) ప్రత్యేక రైలు ఈ నెల 19, 21 తేదీల్లో తిరువనంతపురం నార్త్ స్టేషన్‌లో సాయంత్రం 6-05 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11 గంటలకు శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం స్టేషన్‌కు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (06094) శ్రీసత్యసాయి ప్రశాంతినిలయం స్టేషన్‌లో ఈ నెల 20, 22 తేదీల్లో రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 3-55 గంటలకు తిరువనంతపురం నార్త్ స్టేషన్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు వర్కల శివగిరి, కొల్లం, కాయంకులం, చెంగనూరు, తిరువల్ల, కొట్టాయం, ఎర్నాకులం టౌన్, అలువ, త్రిసూర్, పలక్కడ్, కోయంబత్తూరు, తిరుప్పూరు, ఈరోడ్, సేలం, కుప్పం, బంగారపేట్, వైట్‌ఫీల్డ్, క్రిష్ణరాజపురం, యల్హంక, హిందూపురం స్టేషన్ల మీదుగా శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం చేరుతుందన్నారు. సంత్రగాచి-యల్హంక (08073) ప్రత్యేక రైలు ఈ నెల 21, 28 తేదీల్లో మధ్యాహ్నం 2-45 గంటలకు బయలుదేరి 23, 30 తేదీల్లో తెల్లవారుజామున 12-55 గంటలకు యల్హంకకు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (08074) యల్హంకలో ఈ నెల 23, 30 తేదీల్లో ఉదయం 4-45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటలకు సంత్రగాచికి చేరుతుందన్నారు. ఈ రైలు ఖరగ్‌పూర్, బాలాసోర్, భద్రక్, కటక్, భువనేశ్వర్, కుద్రారోడ్, బెర్హంపూర్, విజయనగరం, దువ్వాడ, విజయనగరం, గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం, హిందూపురం మీదుగా యల్హంకకు చేరుకుంటుందన్నారు.

ధర్మవరం మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి బాగల్‌పూర్-యశ్వంతపూర్ మధ్య సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బాగల్‌పూర్-యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (03403) ఈ నెల ఏడో తేదీ రాత్రి పదిన్నరకు బాగల్‌పూర్‌లో బయలుదేరి 9వ తేదీ రాత్రి 11-50 గంటలకు యశ్వంతపూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (03404) ఈ నెల పదిన ఉదయం ఏడు గంటలకు యశ్వంతపూర్‌లో బయలుదేరి 12న ఉదయం ఏడున్నరకు బాగల్‌పూర్‌కు చేరుకుంటుంద న్నారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, డోన్, గుంటూరు, విజయవాడ, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, బరంపురం, కుర్దారోడ్, భువనేశ్వర్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్, అండుల్, భట్టానగర్, బద్రమన్, రాంపూర్హాట్, బర్హార్వా, సాహిబ్ గంజ్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

లెక్చరర్ పోస్టా.. వద్దులే..!

డైట్ లెక్చరర్ పోస్టులకు టీచర్ల విముఖత

ఏడు పోస్టులకు 15 దరఖాస్తులు, నలుగురికే అర్హత

అనంతపురం విద్య, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డైట్ (ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ)కు లెక్చరర్లుగా వెళ్లడానికి ఉపాధ్యాయులు అయిష్టత చూపుతున్నారు. బుక్కపట్నం డైట్ కళాశాలలో రెగ్యులర్ లెక్చరర్లు లేకపోవడంతో అర్హత కలిగిన ఉపాధ్యాయులను ఫారిన్ సర్వీస్ కింద తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లకు అవకాశం కల్పిస్తూ దరఖాస్తుల ను ఆహ్వానించారు. తెలుగు-2, గణితం-1, ఫైన్ ఆర్ట్స్(కళ) 1, పిలాసఫీ-1, సోషియల్ స్టడీస్-2 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ ఏడు పోస్టులకు కేవలం 15మంది టీచర్లు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో పీజీ ఉన్నా ఎంఈడీ లేకపోవడంతో 11 దరఖాస్తులను తిరస్కరించారు. నలుగురు మాత్రమే డైట్ లెక్చరర్ పోస్టులకు అర్హత పొందారు. వారికి గురువారం నుంచి కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. తొలి రోజు తెలుగు సబ్జెక్టుకు సంబంధించి ఒకరు మాత్రమే హాజరయ్యారని, మిగిలిన పోస్టులకు శుక్ర, శనివారాలలో కూడా పరీక్షలు కొనసాగుతాయని డైట్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. కాగా ఉమ్మడి జిల్లాలో దాదాపు 18వేలమంది టీచర్లు పని చేస్తున్నా అతి తక్కువ దరఖాస్తులు రావడంపై సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతోంది. బుక్కపట్నం సుదూరంగా ఉండటం వల్లే చాలా మంది అనంతపురంలో ఉంటున్న అర్హులైన టీచర్లు దరఖాస్తు చేయలేదనే చర్చ నడుస్తోంది. అదే అనంతపురంలో డైట్ కళాశాల ఉండి, ఇవే పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి ఉంటే ఏస్థాయిలో పోటీనో, ఎన్ని సిఫార్సులు ఉండేవోనన్న అభిప్రాయాలు టీచర్ల నుంచే వినిపిస్తున్నాయి.

మా రెవెన్యూ డివిజన్లు యథాతథంగా కొనసాగించండి

రెవెన్యూ మంత్రి, కమిషనర్, శ్రీసత్యసాయి, అనంత జిల్లా కలెక్టర్లకు ఎమ్మెల్యే పరిటాల సునీత లేఖలు



అనంతపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని రెండు రెవెన్యూ డివిజన్లను యథాతథంగా కొనసాగించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత.. ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ఆమె రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆ శాఖ కమిషనర్ జయలక్ష్మి, శ్రీసత్యసాయి, అనంత జిల్లాల కలెక్టర్లు శ్యాంప్రసాద్, ఆనంద్‌కు గురువారం వేర్వేరుగా లేఖలు రాశారు. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు, ఒక నియోజకవర్గంలోని మండలాలు ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలన్న అంశంపై మంత్రివర్గ ఉపసంఘం, రెవెన్యూశాఖ యోచిస్తున్న తరుణంలో రాప్తాడు నియోజకవర్గంలోని రెవెన్యూ డివిజన్లు యథాతథంగా ఉంచాలని ఆ లేఖలో ఆమె పేర్కొన్నారు. రాప్తాడు నియోజకవర్గం భౌగోళికంగా చాలా భిన్నమైన పరిస్థితుల్లో ఏర్పడిందనీ, ఆరు మండలాలు ఉండగా... జిల్లాల పునర్విభజనలో మూడు మండలాలు అనంతపురం, మరో మూడు శ్రీసత్యసాయి జిల్లాలో చేర్చిన విషయాన్ని లేఖలో పేర్కొన్నారు. అనంతపురం రూరల్, రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నాయన్నారు. కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరి.. ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయన్నారు. భౌగోళికంగా ప్రజల అవసరాలు, పరిపాలనా సౌలభ్యం పరంగా ఇది అందిరీకి అనుకూలంగా ఉందన్నారు. ఒక నియోజకవర్గమంతా ఒక రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటున్న నేపథ్యంలో... తన విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకుని, తమ నియోజకవర్గ భౌగోళిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రజల సౌకర్యం, పరిపాలన సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాలను ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకొస్తే ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆత్మకూరు మండలంలోని గ్రామాల ప్రజలు అనంతపురం మీదుగా ధర్మవరం రెవెన్యూ డివిజన్‌కు వెళ్లాలంటే సుమారు 80 కి.మీ వెళ్లాల్సి ఉంటుందన్నారు. ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధి రామగిరి మండలంలోని మారుమూల గ్రామాల ప్రజలు, అదే తరహాలో చెన్నేకొత్తపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి, గంగినేపల్లి వాసులు ధర్మవరం మీదుగా అనంతపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి రావాలంటే 85 కి.మీ ప్రయాణం చేయాల్సి ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని రైతులు, ప్రజలు, విద్యార్థుల పరిస్థితిని అర్థం చేసుకుని ప్రస్తుతం ఏ రెవెన్యూ డివిజన్‌లో ఏ మండలాలున్నాయో వాటిని అలాగే కొనసాగించేలా చూడాలని ఎమ్మెల్యే.. ప్రభుత్వాన్ని కోరారు.

సత్యసాయి స్ఫూర్తిని చాటేలా..

శతజయంత్యుత్సవాలు: జేసీ



పుట్టపర్తి టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా స్ఫూర్తిని చాటేలా శతజయంత్యుత్సవాలను నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల నిర్వహణపై అధికారులు, సత్యసాయి ట్రస్టు సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులపై ఆరాతీశారు. జేసీ మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లను చేయాలన్నారు. జిల్లా యంత్రాంగం, సత్యసాయి ట్రస్టు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, వివిధ శాఖల అధికారులు, సత్యసాయి ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు

పుట్టపర్తి టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా శుక్రవారం నుంచి ఏడాదిపాటు జిల్లావ్యాప్తంగా ఉత్సవాలు నిర్వహించాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ గురువారం ప్రకటనలో అధికారులను ఆదేశించారు. వందేమాతరం సందేశం, ప్రాధాన్యతను ప్రతిబింబించే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలపించాలన్నారు.

రేపు పీఆర్ ఇంజనీర్ల సంఘం ఎన్నిక

అనంతపురం న్యూటౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ (పీఆర్) ఇంజనీర్ల సంఘం ఎన్నిక ఈనెల 8న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ ఎస్ఈ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 9న శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి ఎన్నిక నిర్వహించనున్నారు. ఏకగ్రీవం చేస్తారా, ఎన్నిక నిర్వహించాల్సి వస్తుందా అన్నది తేలాల్సి ఉంది.

పట్టణంలో గంజాయి మొక్కలు



పరిశీలిస్తున్న ఏఎస్పీ

తాడిపత్రి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టైలర్స్‌కాలనీలో ఇళ్ల మధ్యలో రంగనాథ్ అనే వ్యక్తికి చెందిన ఖాళీ స్థలంలో గంజాయి మొక్కలు ఉన్నట్లు పోలీసులు గురువారం గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తుల సమాచారం మేరకు ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి, పట్టణ సీఐ ఆరోహణరావు, ఎస్ఐ గౌస్‌బాషా తమ సిబ్బందితో ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అక్కడున్న మొక్కలను పరిశీలించి గంజాయి మొక్కలేనని నిర్ధారించారు. దీంతో ఎక్సైజ్, రెవెన్యూ అధికారులను పిలిపించి పంచనామా నిర్వహించారు. కాగా రంగనాథ్ తన కుటుంబంతో కలిసి ధర్మవరంలో నివసిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

యాదవులను ఆదుకుంటాం

సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ



మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న యాదవులను ఆదుకుంటామని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు రా మకృష్ణ అన్నారు. నక్కా రామ్మోహన్‌రావు యాదవ కల్యాణమండపం లో గురువారం యాదవసంఘం నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో యాదవులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందడానికి యాదవ ఎంప్లాయీస్ ఫెడరేషన్, యాదవ విద్యార్థి సంఘం, యాదవ మహిళా సంఘం వంటి వాటి వాటిని ఏకతాటిపైకి తెస్తామన్నారు. సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి గోపాల్, సీనియర్ నాయకులు నారాయణస్వామి పాల్గొన్నారు.

ఎంపీడీఓపై వైసీపీ నాయకుడి దాడి



పోలీస్ స్టేషన్ వద్ద ఎంపీడీఓ

రొళ్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల ఎంపీడీఓ నాగేశ్వర శాస్త్రిపై వైసీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ కవిత భర్త విజయ రంగేగౌడ్ దాడి చేశారు. దీంతో ఆయనపై ఎంపీడీఓ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బిల్లుల విషయమైన గురువారం మధ్యాహ్నం ఎంపీడీఓను ఆయన కార్యాలయంలో విజయ రంగేగౌడ్ కలిశారు. పెండింగ్ బిల్లులను వెంటనే చేయాలని కోరారు. మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసిన తరువాతే బిల్లులు చేస్తామని ఎంపీడీఓ సమాధానం ఇచ్చారు. దీంతో ఆగ్రహానికి గురైన విజయ రంగేగౌడ్.. ఎంపీడీఓను దూషిస్తూ, దాడికి ప్రయత్నించారు. దీంతో ఎంపీడీఓ కార్యాలయం నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం కారు ఎక్కబోతుండగా ఎంపీడీఓను రంగేగౌడ్ నెట్టేశారు. కిందపడ్డ ఎంపీడీఓ, కాలికి గాయం కావడంతో డ్రైవర్ సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ సుమన్‌కు ఫిర్యాదు చేశారు.

దాడి సరికాదు

పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య

అనంతపురం న్యూటౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రొళ్ల ఎంపీడీఓ నాగేశ్వర శాస్త్రిపై దాడి సరికాదని పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వర్ల శంకర్ పేర్కొన్నారు. ఎంపీడీఓపై గురువారం దాడి చేసిన రొళ్ల మండలం మాజీ అధ్యక్షుడు విజయ రంగేగౌడ్‌పై చట్టరీత్యా చర్యలు చేపట్టాలని ప్రకటణలో డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం.. అధికారులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు



నాగయ్య (ఫైల్)

ధర్మవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేసి మరో ఇద్దరు ఈ లోకాన్ని చూసే వీలు కల్పించారు తమ్మిశెట్టి నాగయ్య(80) కుటుంబ సభ్యులు. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన తమ్మిశెట్టి నాగయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. యువర్స్ ఫౌండేషన్ సభ్యులు మృతుడి కుటుంబసభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి, వారి అంగీకారం మేరకు నేత్రాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రెడ్ క్రాస్ సొసైటీ డీవై కుళ్లాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర, డాక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతుడి భార్య లక్ష్మీదేవి, కుమారులు కాశీవిశ్వనాథ్, నాగేశ్‌కు యువర్స్ ఫౌండేషన్ సభ్యులు వైకేశ్రీనివాసులు, డాక్టర్ సుబ్బారావు, లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బత్తలపల్లి, ముదిగుబ్బలో రెండు మద్యం షాపులకు దరఖాస్తులను ఆహ్వానించినట్లు ధర్మవరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బత్తలపల్లిలోని షాపు నెంబరు -13, ముదిగుబ్బలోని షాపు నెంబరు 18లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు రూ.2లక్షలు డీడీ తీసి వాటికి ఆధార్‌కార్డు జతచేసి ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 10 సాయంత్రం 5గంటలలోపు ఆన్‌లైన్ కానీ ఆఫ్‌లైన్‌లో కానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 12న శ్రీసత్యసాయిజిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడ్రా తీస్తామని ఆమె తెలిపారు.

ఉత్తమ పొలిటీషియన్‌గా వజ్రకరూరు సర్పంచ్



మోనాలిసా

ఉరవకొండ, నవంబరు6(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ మోనాలిసాకు ఉత్తమ పొలిటీషియన్‌గా గుర్తింపు దక్కింది. ముంబైలో ఈనెల 8, 9 తేదీల్లో ఇండియన్ స్కూల్ ఆఫ్ డెమోక్రసీ ప్రతినిధులు ఆధ్వర్యంలో జరిగే శిక్షణ తరగతులలో ఆమె పాల్గొననున్నారు. ఆర్థిక అభివృద్ధి లక్ష్యాలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. గతంలోనూ ఆమె ఢిల్లీలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు అందుకున్నారు.

రైల్వే ఆస్తుల భద్రతను విస్మరించవద్దు

● ఆర్పీఎఫ్ ఐజీ అరోమా సింగ్ ఠాకూర్



ఆర్పీఎఫ్ అధికారులతో మాట్లాడుతున్న ఐజీ అరోమా సింగ్ ఠాకూర్

గుంతకల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైల్వే ఆస్తుల రక్షణ బాధ్యతను విస్మరించవద్దని ఆర్పీఎఫ్ ఐజీ అరోమాసింగ్ ఠాకూర్ పేర్కొన్నారు. రైల్వే డివిజనల్ కేంద్రమైన గుంతకల్లులో గురువారం ఉదయం ఆమె తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్, ఆర్పీఎఫ్ బ్యారక్స్‌ను ఐజీ సందర్శించారు. కొన్ని నెలల కిందట ఆర్పీఎఫ్ కార్యాలయానికి సమీపంలోనే రైల్వేకు చెందిన కేబుళ్ల చోరీ కావడం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో గుంతకల్లు డివిజనల్ సెక్యూరిటీ కమిషనరు ఆకాశ్‌కుమార్ జైస్వాల్, సహాయ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్లు అనిల్‌కుమార్ సింగ్, రాజ్ గోపాల్ రెడ్డి, స్థానిక ఆర్పీఎఫ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో చురుగ్గా పాల్గొనండి: ఎస్కేయూ వీసీ



మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ అనిత

గుంతకల్లు/టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటూనే క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని ఎస్కేయూ వైస్ చాన్సలర్ అనిత పేర్కొన్నారు. స్థానిక శ్రీ శంకరానందగిరి డిగ్రీ కళాశాలలో ఎస్కేయూ అనుబంధ అంతర్ కళాశాలల పురుషుల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వైస్ చాన్సలర్ అనిత మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కళాశాల కరస్పాండెంటు కేసీ హరి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ఆడాలన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి జెస్సీ, ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మస్తానప్ప, ఆతిథ్య కళాశాల పీడీ మహబూబ్ బాషా, వివిధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

పరిశ్రమకు సబ్సిడీ

పశుసంవర్థక శాఖ జేడీ ప్రేమ్‌చంద్

అనంతపురం అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పాలు, మాంస ఆధారిత ఉత్పత్తుల తయారీ పరిశ్రమ ఏర్పాటు కోసం ప్రభుత్వం సబ్సిడీని ఇస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లబ్ధిదారులకు ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం ద్వారా 35 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. 10 శాతం లబ్ధిదారుల వాటా, 90 శాతం బ్యాంక్ రుణ సదుపాయం కల్పిస్తారన్నారు. ఈ పథకం కింద పాల ఆధారిత ఉత్పత్తులైన పెరుగు, మజ్జిగ, వెన్న, నెయ్యి, పన్నీర్, కోవా తీపి పదార్థాలు, మాంసాహార ఉత్పత్తులైన మాంస ఊరగాయలు, ఇతర మాంస ప్రాసెసింగ్ పదార్థాల తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చునన్నారు. ఔత్సాహికులు జిల్లా రిసోర్స్ పర్సన్ హరీష్ 9676796974 నంబరులో సంప్రదించాలన్నారు. అలాగే జిల్లా ఉద్యాన అధికారి కార్యాలయం, పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో సంప్రదించవచ్చునని తెలిపారు.

న్యూస్ బాక్స్

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే



పల్లా శ్రీనివాసరావుతో ఎమ్మెల్యే, ఇతర నాయకులు

అనంతపురం క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కలిశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. పల్లాతో అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితుల గురించి చర్చించారు. 15వ తేదీలోగా పార్టీ కమిటీలు పూర్తి చేయాలన్న ఆదేశాలున్న నేపథ్యంలో పలు అంశాల గురించి ఎమ్మెల్యే పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో చర్చించారు. మరో నాలుగైదు రోజుల్లో పార్టీ కమిటీలపై స్పష్టత వస్తుందని, పార్టీ కోసం కష్టపడే వారికి అన్యాయం జరగనివ్వమని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టంచేశారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదాతలను అభినందిస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం విద్య, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీచైతన్య విద్యాసంస్థలో మెగా రక్తదానశిబిరం నిర్వహించారు. గురువారం ఆ విద్యాసంస్థల చైర్‌పర్సన్ ఝాన్సీ జన్మదినాన్ని పురస్కరించుకుని రాంనగర్‌లోని కమ్మభవన్ సమీపంలో ఉన్న శ్రీచైతన్యస్కూల్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్ కట్‌చేసి ఆనందం పంచుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు టీచర్లు, సిబ్బంది రక్తదానం చేశారు. ఏజీఎం సుబ్బారెడ్డి రక్తదాతలను అభినందించారు. ప్రిన్సిపాల్స్, డీన్స్, టీచర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ముస్లింలకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీ నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు కష్టపడిన మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో న్యాయం చేయాలని టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆజం ఫంక్షన్‌హాల్‌లో ముస్లింమైనార్టీ నేతలు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ మైనార్టీలకు పెద్దపీట వేస్తామని, అభివృద్ధికి పాటుపడుతామని వాగ్దానాలు చేశారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతున్నా ఇంత వరకూ నామినేటెడ్ పదవులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మోద్దీన్, నూర్‌బాష దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఉమర్‌ముక్తార్, ముస్లిం నాయకులు సాలార్‌బాషా, తాజుద్దీన్, సైపుద్దీన్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

పెద్దాస్పత్రికి 50 వీల్‌చైర్లు



ఆస్పత్రికి చేరిన వీల్‌చైర్లు

అనంతపురం వైద్యం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలకు 50 వీల్‌చైర్లు వచ్చాయి. మీనాక్షమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ(హెచ్‌డీసీ) సభ్యులు కొప్పల వెంకటరమణ వీటిని వితరణచేశారు. గత నెలలో నిర్వహించిన హెచ్‌డీసీ సమావేశం సందర్భంగా కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సమక్షంలో తాను 50 వీల్‌చైర్లు ఇస్తానని వెంకటరమణ హామీ ఇచ్చారు. ఈ మేరకు వాటిని గురువారం ఆస్పత్రికి చేర్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత వీల్‌చైర్లను పరిశీలించి సిబ్బంది చేత భద్రపరిచారు. శుక్రవారం ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్ ఆధ్వర్యంలో వీల్‌చైర్లను వినియోగార్థం అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్‌కు పది బ్రెస్ట్ పంప్‌లను కూడా వెంకటరమణ వితరణ చేయనున్నట్లు తెలిపారు.

స్వాహా సొమ్మును ఇప్పించండి

చెన్నేకొత్తపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాజేసిన రుణాల రికవరీ సొమ్మును తిరిగి ఇప్పించాలని మండలంలోని ప్రసన్నాయపేటకు చెందిన డ్వాక్రామహిళలు గురువారం ఎస్ఐ సత్యనారాయణను కలిసి విన్నవించారు. గ్రామంలోని డ్వాక్రా సంఘాలకు చెల్లించిన రుణాల రికవరి సొమ్ము రూ.30లక్షలకుపైగా అదే గ్రామానికి చెందిన బిజినెస్ కరస్పాండెంట్ క్రిష్ణారెడ్డి కాజేసినట్లు వారు తెలిపారు. మహిళలు తమకు న్యాయం చేయాలని కనుముక్కల ఏపీ గ్రామీణ బ్యాంకు ఎదుట బుధవారం ఆందోళన కూడా చేశారు. తాము తీసుకున్న అప్పును నెలనెలా కంతులవారీగా కరస్పాండెంట్‌ను నమ్మి చెల్లించామనీ, బ్యాంకులో జమ చేయకుండా కాజేశాడని వారు ఎస్ఐ ఎదుట వాపోయారు. పోలీసుస్టేషన్‌కు పిలిపించి విచారిస్తామని ఎస్ఐ సత్యనారాయణ వారితో పేర్కొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నార్పల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గురువారం పంచాయతీ సెక్రెటరీకి సీఐటీయూ మండల నాయకులు బాలాజీ నాయక్, తపాలా శ్రీనివాసులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో 30 సంవత్సరాల నుంచి ఎలక్ట్రీషియన్, వాటర్ మెన్, స్వీపర్లుగా, కంప్యూటర్ ఆపేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారన్నారు. గాజుల లక్ష్మీనారాయణ, లక్ష్మీనరసమ్మ, కుళ్లాయప్ప, సాకే పెద్దరాజు, తపాలా శివశంకర్ పాల్గొన్నారు.

స్టోన్ క్రషర్‌పై విచారణ

అనంతపురం రూరల్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసనాయనికుంట సమీపంలోని సంగమేశ్వర స్టోన్ క్రషర్‌పై వివిధ శాఖల అధికారులు గురువారం విచారణ చేపట్టారు. ఇటీవల గ్రామస్థులు స్టోన్ క్రషర్ వల్ల కలుగుతున్న నష్టాలపై ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతి పత్రం ఇచ్చారు. దీంతో అధికారులు స్టోన్ క్రష్ చేయకూడదని క్రషర్‌ను బంద్ చేయించారు. క్రషర్ కొనసాగింపు చర్యలు జరుగుతున్నాయని గత సోమవారం మరో మారు వినతి పత్రం ఇచ్చారు. దీంతో గురువారం గనులు, భూగర్భ శాఖ డీడీ ఆదినారాయణ, నెల్లూరుకు చెందిన మైనింగ్ సేఫ్టీ డీడీ కిశోర్‌కుమార్, గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ డీడీ గంగాధర్, తహసీల్దార్ మోహన్‌కుమార్, వ్యవసాయాధికారి వెంకట్‌కుమార్ తదితరులు స్టోన్ క్రషర్ ప్రాంతంలో పర్యటించారు. క్రషింగ్ జరుగుతున్న ప్రాంతం మొత్తాన్ని పరిశీలించారు. క్రషర్ నిర్వాహకులకు జాక్ హ్యామర్ డ్రిల్లింగ్‌కు అనుమతులుంటే.. బోరు హోల్స్ వేసి బ్లాస్టింగ్ చేపట్టినట్లు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ చేసిందుకు నోటీసులు జారీ చేశారు. పనులు నిలిపివేయాలని ఆదేశించారు.

సీట్లన్నీ ఖాళీ

- నగరపాలక సంస్థలో ప్రధాన పోస్టులు ఖాళీ
- ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్న పరిస్థితి
- అధ్వానంగా మారిన పారిశుధ్య విభాగం
- అధికారుల మధ్య లోపించిన సమన్వయం
- అంతంతమాత్రంగా నగర అభివృద్ధి



నగరపాలక సంస్థ కార్యాలయంలోని నీటిసరఫరా విభాగం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో ప్రధాన అధికారుల పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఇన్‌చార్జ్‌లతో నే పాలనను నెట్టుకొస్తున్నారు. ఏఎంసీ సెక్రటరీ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, ఏసీపీ, మేనేజర్, అడిషినల్ కమిషనర్ ఇలా అన్ని రకాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో నగరపాలక సంస్థ ఆశించిన మేర అభివృద్ధికి నోచుకోలేకపోతోంది. నగరపాలక సంస్థగా రూపాంతరం చెంది దాదాపు రెండు దశాబ్దాలు గడిచినా నగరంలో అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉంది. సరైన రోడ్లు, మురుగుకాలువ వ్యవస్థ, తాగునీరు, డంపింగ్ యార్డు లేవు. వీధి కుక్కలు, ఆవులు, పందుల నియంత్రణ కనిపించదు. ఈ సమస్యలపై నగర ప్రజలు ఫిర్యాదు చేసిన నగరపాలక సంస్థ అధికారుల స్పందించి పరిష్కరించడం అంతంతమాత్రంగానే ఉంటోంది. నగరంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నా నియంత్రించే నాథుడే లేడు.

ఇన్‌చార్జిలే దిక్కు.

నగరపాలక సంస్థలో ఏఎంసీ సెక్రటరీ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అడిషినల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్‌లో ఏసీపీ, టీపీఓ, టీపీఈఎస్, టీపీబీఓ పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి. టీపీఓ శిరీషకే ఏసీపీ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. పరిపాలనలో కీలకంగా ఉండే మేనేజర్ పోస్టు కూడా ఖాళీగానే ఉంది. రెవెన్యూ విభాగంలో సుమారు 19ఏళ్ల పాటు చేసిన సుజాతకు మేనేజర్‌గా బాధ్యతలు ఇచ్చినప్పటికీ వివిధ ఆరోపణలతో ఆమెను తప్పించారు. పెన్షన్ విభాగంలో పనిచేస్తున్న అధికారి ఖయ్యూమ్‌కి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. డీఈగా పనిచేస్తున్న ఇంజనీరు నరసింహులును ఇన్‌చార్జ్ ఎంహెచ్‌ఓగా నియమించారు. ఇంజనీరింగ్ విభాగంలో వార్డు సచివాలయంలో పని చేస్తున్న అమెనిటీస్ సెక్రటరీలు 8మందికి అర్హత లేకపోయిన ఏఈలుగా నియమించారు. ఇన్‌చార్జ్‌ల పాలనలో నగరపాలక సంస్థలో అభివృద్ధి అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కమిషనర్ దృష్టి సారించేనా..?

గత జనవరిలో అనంత నగరపాలక సంస్థ కమిషనర్‌గా వచ్చిన బాలస్వామి ఖాళీ పోస్టుల భర్తీపై దృష్టి పెడతారా? లేక మిన్నకుండిపోతారా అనే చర్చ నడుస్తోంది. డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో అత్యధిక అనుభవశాలి అయిన కమిషనర్ నగర పాలికలో ఏం జరుగుతోంది తెలుసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఏయే విభాగాల్లో ఎవరెవరు విధులకు హాజరవుతున్నారు? ఎవరు డుమ్మా కొడుతున్నారనే విషయాలపై కనీసం ఆరా తీయాలని కోరుతున్నారు. కమిషనర్ కార్పొరేషన్ పరిధిలో జరిగే భూమి పూజ, శంకుస్థాపనలకే పరిమితమవుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గత ఆరు నెలలుగా బిల్లులు కావడం లేదని పనులుచేసిన కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యలపై కమిషనర్ దృష్టి సారించి నగర పాలకసంస్థను గాడిన పెట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

'అపరిశుభ్రం'గా పారిశుధ్య విభాగం

నగరపాలక సంస్థలో శానిటేషన్ విభాగం కీలకం. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి పారిశుధ్య విభాగం బలంగా పనిచేయాల్సి ఉంది. అయితే శానిటేషన్ పర్యవేక్షించడానికి, కార్మికులు, సిబ్బంది సక్రమంగా పని చేయడానికి ఇక్కడ ఒక డాక్టర్ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌గా ఉండాల్సి ఉంది. కానీ గత వైసీపీ పాలన పుణ్యమా అని డాక్టర్లు కాని ఇంజనీర్లకు ఎంహెచ్‌ఓ బాధ్యతలు అప్పగించే అనవాయితీకి శ్రీకారం చుట్టారు. దీంతో గత వైసీపీ పాటించిన పద్ధతిలోనే కూటమి ప్రభుత్వం కూడా ఎంహెచ్‌ఓ బాధ్యతలు జనరల్ అధికారులకు అప్పగిస్తూ వస్తోంది. గత 8నెలలుగా ఏఎంసీ సెక్రటరీ రంగస్వామి ఇన్‌చార్జి ఎంహెచ్‌ఓగా పని చేసి, ఇటీవల మైదుకూరు కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. దీంతో డీఈగా ఉన్న నరసింహులుకు ఎంహెచ్‌ఓ బాధ్యతలు అప్పగించారు. శానిటేషన్ సెక్రటరీలుగా ఆరు సర్కిళ్లకు ఒక్కరే రెగ్యులర్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నారు. ఐదు సర్కిళ్లలో మేస్త్రీలకు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ల బాధ్యతలు అప్పగించారు. కనీస విద్యార్హత లేనివారిని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లుగా నియమించడంతో నగరంలో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సర్కిల్ 6లో నలుగురు సిబ్బంది విధులకు హాజరు కాకుండా వేతనాలు తీసుకుంటున్నా పట్టించుకునేవారే లేరు. కొవిడ్ సమయంలో నియమించిన ఉద్యోగుల్లో రవికుమార్, ఉదయ్ కుమార్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది శివకుమార్, రెగ్యులర్ సిబ్బంది కేఆర్ నల్లమ్మ 9నెలలుగా విధులకు రాకుండా జీతాలు పొందుతున్నారు. శానిటేషన్ విభాగంలో ప్రతి సర్కిల్, ప్రతి వార్డులో ఇలా 10 నుంచి 20 మంది సిబ్బంది కనీస అనుమతి లేకుండా విధులకు డుమ్మా కొడుతూ జీతాలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

విభాగాల మధ్య కొరవడిన సమన్వయం

నగరపాలక సంస్థలో ఉన్న వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయం కొరవడింది. నగరపాలక సంస్థలో ప్రధానంగా టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగం, శానిటేషన్, జనన-మరణాల విభాగం, మెప్మాలు ఉన్నాయి. అయితే ఆయా శాఖలు సంయుక్తంగా చేసే కార్యక్రమాలలో సైతం అధికారుల మధ్య సఖ్యత లేకపోవడం గమనార్హం. అటు అధికారులు, ఇటు ఉద్యోగుల తీరుతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

గాడిలో పెడతాం..



నగరపాలక సంస్థలో అన్ని విభాగాలను గాడిలో పెట్టడానికి ఇప్పటికే చర్యలు ప్రారంభించాం. ఒక్కొక్క విభాగంపై దృష్టి పెడుతూ ఆయా సమస్యలు, అక్కడి పరిస్థితులు తెలుసుకుంటున్నాం. ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అన్ని విభాగాలను ప్రక్షాళన చేసి, పాలనను గాడిలో పెట్టడానికి కృషి చేస్తాం. ఉద్యోగుల సమయపాలన మొదలు వారు చేసే పనుల పట్ల కూడా ఆరా తీస్తున్నాం. త్వరలో అన్నింటికి ఓ స్పష్టత ఇస్తాం.

-బాలస్వామి, కమిషనర్, అనంత నగరపాలక సంస్థ

విజేతలకు ఎంపీ అభినందన



రాష్ట్రస్థాయి విజేతలను అభినందిస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కడంతో విజేతలను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అభినందించారు. గురువారం తన నివాసంలో ఎంపీ పతకాలు సాధించిన వారిని సత్కరించారు. బాలికల్లో తేజస్వని, కరిష్మ, కృష్ణకీర్తన, పూజిత (బంగారు పతకం), మోనికా, తన్మయి, యశస్వ ని (రజతపతకం)లు సాధించారు. బాలురలో గౌతమ్ కృష్ణారెడ్డి, హరిచరణ్ తేజ్ (బంగారుపతకం) తరుణ్ సాయి రజత పతకాలు సాధించారు. క్రీడాకారులు త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, కోచ్‌లు శాంతరాజ్, రామాంజి, తులసి రాజేష్, శ్రీకాంత్, యోగానంద, అంజుమ్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురంరూరల్(ఆంధ్రజ్యోతి): ఏపీ వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో 10వ తేదీన కర్నూలులో తలపెట్టిన దృఢసంకల్ప దీక్షకు సంబంధించిన పోస్టర్లను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆవిష్కరించా రు. గురువారం ఎంపీ క్యాంపు కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించా రు. దీక్షకు హాజరుకావాలని నాయకులు ఎంపీని కోరారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవ, జిల్లా అధ్యక్షుడు మాధవయ్య, కార్యదర్శి చలపతి, కుళ్లాయప్ప, ముత్యాలు, ఆదినారాయణ, వీర, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల ఢీ.. నలుగురికి గాయాలు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపం జాతీయరహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కుంటిమద్దికి చెందిన సురేశ్‌బాబు, హరియాన్ చెరువుకు చెందిన కేశవయ్య ద్విచక్రవాహనంలో న్యామద్దలకు చెందిన విశ్వనాథ్, బాషా వేరువేరు ద్విచక్రవాహనాలలో ఎన్ఎస్‌గేటు నుంచి చెన్నేకొత్తపల్లి వైపు వస్తున్నారు. చెన్నేకొత్తపల్లి సమీపంలోకి రాగానే ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో నలుగురూ గాయపడ్డారు. స్థానికులు ఆటోలో వారిని సీకేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సురేశ్‌బాబుకు తీవ్ర గాయాలు కావడంతో 108వాహనంలో అనంతపురానికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రేపు కనకదాస జయంతి

రామగిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్రిమేకలపల్లిలో 8వ తేదీన కనకదాస జయంతిని నిర్వహిస్తున్నట్లు గ్రామ కురుబ సంఘం నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జ్యోతులు, బోనాలు, గురవయ్యలతో పాలు తాగించే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కురుబలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

గార్లదిన్నె, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పండ్లతోటలు సాగుచేసే రైతులు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ పండ్లతోటలు సాగుచేసే రైతులు వాటికి సోకే తెగుళ్లతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెగుళ్ల నివారణ, సాగు విధానంపై రైతులకు సూచనలిచ్చేందుకు నిమ్మ, చీనీ పరిశోధన కేంద్రం నాగపూర్ నుంచి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ శాస్త్రవేత్తల బృందం శుక్రవారం రానున్నట్లు ఆయన తెలిపారు. డాక్టర్ ఏకే దాస్ నేతృత్వంలో ముకుందాపురం గ్రామంలో పండ్ల తోటలను వారు పరిశీలిస్తారన్నారు.

బాలిక మిస్సింగ్ కేసు 3 గంటల్లో ఛేదింపు



చిన్నారిని తల్లికి అప్పగిస్తున్న సీఐ శ్రీకాంత్ యాదవ్

అనంతపురం క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ తప్పిపోయిన 5 ఏళ్ల బాలికను అనంతపురం టూటౌన్ పోలీసులు మూడు గంటల్లో గుర్తించారు. సీఐ శ్రీకాంత్ యాదవ్ బాధిత తల్లికి చెంతకు బాలికను చేర్చారు. సీఐ తెలిపిన మేరకు ఐదేళ్ల వయస్సు ఉన్న అలేఖ్య ధర్మవరం టౌన్‌లోని కదిరి గేట్ వద్ద నివాసం ఉంటున్న కీర్తి, కుమార్ దంపతుల కుమార్తె. బర్త్ సర్టిఫికెట్ కోసమని తల్లి కీర్తి కుమార్తెతో కలసి 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రికి వచ్చింది. ఆసుపత్రి ఆవరణలో మెయిన్ గేటు దగ్గర ఇసుకలో ఉదయం 7.30 గంటలప్పుడు ఆడుకుంటుండగా... తల్లి టిఫిన్ కోసం బయటకు వచ్చింది. మళ్లీ వచ్చి చూడగా పాప కనిపించలేదు. తల్లి స్థానిక ఆసుపత్రి సిబ్బంది వెతికినా కనిపించలేదు. చివరికి టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు బాలిక కోసం ఆసుపత్రి పరిసరాల్లో తీవ్రంగా వెతికారు. మూడు గంటల్లోనే చిన్నారి ఆచూకీ గుర్తించి అలేఖ్యను తల్లికి అప్పగించారు.

వంద శాతం చదువుకోవాలి: డీడీ

శింగనమల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వంద శాతం చదువుకునే విధంగా పిల్లలను తీర్చిదిద్దాలని వయోజన విద్య డీడీ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలాస్ కార్యాక్రమంపై మండల వయోజన విద్య వలంటీర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి వలంటీరు 10 మంది చొప్పున చదువురాని వారిని ఎంపిక చేసుకుని సాయంత్రం సమయంలో గంట చదువు నేర్పించాలన్నారు. ఎంపీడీఓ భాస్కర్, ఎంఈఓ నరసింహరాజు, వయోజన విద్య సూపర్‌వైజర్ శ్రీధర్, ఏపీఎం ఈశ్వరయ్య, ఏపీఓ భాగ్యలక్ష్మి, దామోదర్ పాల్గొన్నారు.

అరటి ఆధారిత ఉత్పత్తుల తయారీతో లాభాలు

- ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి



అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారులు

అనంతపురం అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అరటి ఆధారిత ఉత్పత్తుల తయారీతో అధిక లాభాలు ఉంటాయని ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవి అన్నారు. గురువారం స్థానిక అనంతపురం ప్రాంతీయ ఉద్యాన శిక్షణ కేంద్రంలో అనంత హార్టికల్చర్ కాంక్లేవ్ ఒప్పందంలో భాగంగా అనానా ఫిట్ నేచురల్ కంపెనీ ప్రతినిధులు అరటి ఆధారిత ఉత్పత్తుల తయారీపై డ్వాక్రా సంఘాల సభ్యులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు, రైతులకు అవగాహన కల్పించారు. అరటి బోదెల నుంచి నారతీసే మెలకువలు వివరించారు. అనంతరం బ్యాగ్‌లు, బుట్టలతోపాటు అలంకరణ వస్తువులు, చీరలను ప్రదర్శించారు. మార్కెట్ అవకాశాలు, చేనేత ఉత్పత్తుల తయారీపై అవగాహన కల్పించారు. అంకిత కంపెనీ రీసోర్స్‌పర్సన్ శేఖర్, ఉద్యాన శాఖ ఏడీ దేవానంద్, డీఆర్‌డీఏ ఏపీడీ రాధారాణి, ఆత్మా పీడీ పద్మలత, సెరికల్చర్ టెక్నికల్ ఆఫీసర్ అంజన్‌రెడ్డి, డీఆర్‌డీఏ ఏపీఎం రియాజ్ బేగ్ పాల్గొన్నారు.

ఉద్యమ నేతలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి

- ఎస్పీకి సంఘాల నేతల వినతి



ఎస్పీ జగదీశ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉద్యమ నేతలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని పలు సంఘాల నాయకులు ఎస్పీని కోరారు. గురువారం ఎస్పీ జగదీశ్‌ను డీపీఓలోని ఆయన చాంబర్‌లో నాయకులు సాకే హరి, బీసీఆర్ దాస్, నెరమెట్ల ఎల్లన్న, చామలూరు రాజగోపాల్, సుగమంచి శ్రీనివాసులు, అంజీ, రామాంజనేయులు, శ్రీరాము, ఆదినారాయణ కలిశారు. వారు మాట్లాడుతూ కేంద్రం నుంచీ ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయాలని, పోలీసుల అనుమతితోనే ఇటీవల ర్యాలీ చేశామన్నారు. ఈ ఘటన ద్వారా శాంతి భద్రతలకు భంగం కలిగించామంటూ సంఘాల నాయకులుపై వన్‌టౌన్ పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. పేద ప్రజలకు న్యాయం జరగాలని, ఆర్డీటీ కోసం మాత్రమే తాము ర్యాలీ చేశామన్నారు. సంఘాల నేతల వినతికి ఎస్పీ కూడా సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

'దశాబ్దాల కల నెరవేర్చిన ఎమ్మెల్యే'



వై.కొత్తపల్లికి వేసిన తారురోడ్డును చూపుతున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వై కొత్తపల్లి గ్రామానికి తారు రోడ్డు నిర్మించి గ్రామస్థుల దశాబ్దాల కల ఎమ్మెల్యే పరిటాల సునీత నెరవేర్చారని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ వై. కొత్తపల్లి గ్రామస్థులు కొన్నేళ్లుగా సరైన రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టి తీసుకెళ్లడంతో, ఆమె స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయించారన్నారు. పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి, హనుమప్ప చౌదరి, కందుల ఓబుళపతి, అక్కులన్న, ఆదెప్ప, సుధాకర్, ఉమాపతి, సీతయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

తాగునీటి కార్మికులపై అక్రమ చర్యలు నిలిపివేయాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్



మాట్లాడుతున్న నాగేంద్రకుమార్

అనంతపురం టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని వాటర్ సప్లై కార్మికులపై అక్రమ చర్యలను నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 17 సంవత్సరాలుగా ప్రజలకు నిరంతరాయంగా తాగునీటి సేవలందిస్తున్న కార్మికులపై కొత్త కాంట్రాక్టర్ అడపాల వెంకటరావు దౌర్జన్యపూర్వకంగా వ్యవహరిస్తున్నాడన్నారు. కార్మికులతో రూ.100 ఖాళీ బాండ్లపై బలవంతంగా సంతకాలు చేయించుకోవడమేకాక వారి వేతనాలను రూ.17300లను రూ.11వేలకు తగ్గించి, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్ వంటి హక్కులను నిరాకరించాడన్నారు. ఈ అన్యాయాలకు వ్యతిరేకంగా నిలిచిన 23 మంది కార్మికులను విధుల నుంచి అక్రమంగా తొలగించారని తెలిపారు. ఈ చర్యలు కార్మిక చట్టాలకు, మానవ హక్కులకు విరుద్ధం మాత్రమే కాక ప్రజలకు తాగునీరందించే ముఖ్యమైన సేవా వ్యవస్థను కూడా అస్థిరం చేస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో దశలవారీగా నిరసనలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీ నాయుడు పాల్గొన్నారు.

జహ్రాన్ మమ్దాని విజయం అపూర్వం

- సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

అనంతపురం టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అమెరికా దేశంలోని న్యూయార్క్ మేయర్‌గా జహ్రాన్ మమ్దాని ఎన్నికకావడం అపూర్వమని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప అన్నారు. మేయర్‌గా మమ్దానీ ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ కూడలి వద్ద ఆయన చిత్రపటంతో ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమెరికా దేశానికి కుంభస్థలం వంటి న్యూయార్క్ మహానగరంలో తనను తాను సోషలిస్టుగా ప్రకటించుకున్న డెమోక్రటిక్ అభ్యర్థి మమ్దాని విజయం సాధించడం గర్వించతగ్గ విషయమన్నారు. పెట్టుబడిదారీ విధానం వికటాట్టహాసం చేసే చోట సామాన్యుడి ఆకాంక్షల స్వరాన్ని జోహ్రాన్ గట్టిగా వినిపించారన్నారు. ప్రపంచ దేశాలపై పెత్తనానికి సామ్రాజ్యవాద వ్యూహాలు రూపొందించేచోట ప్రజల ఆరోగ్యం, పబ్లిక్ స్కూళ్ల బలోపేతం, ఇంటి అద్దెల నియంత్రణ వంటి అంశాలను ఆయన ఎజెండాగా చేసుకున్నారన్నారు. కార్పొరేట్ల లాభాలు మాత్రమే చర్చలుగా సాగే చోట కార్మికుల హక్కులను ఆయన ప్రస్తావించారని పేర్కొన్నారు. మమ్దానీని ఎన్నుకుంటే న్యూయార్క్ నగరానికి నిధులు ఇవ్వబోమంటూ ట్రంప్ హెచ్చరించినా ప్రజలు ఆయన మాటలను ఖాతరు చేయలేదన్నారు. 1965 తర్వాత న్యూయార్క్ మేయర్ పదవికి పోటీచేసిన ఏ అభ్యర్థికీ మమ్దానీకి వచ్చినన్ని ఓట్లు రాకపోవడం విశేషమన్నారు. సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటనారాయణ, ప్రకాష్‌రెడ్డి, వలి, మసూద్, ఇర్ఫాన్, ఎన్టీఆర్ శ్రీనివాసులు, జీవ, వెంకట, ఇస్మాయిల్, శంకర్, రియాజ్, తిమ్మరాజు పాల్గొన్నారు.



క్లాక్‌టవర్ కూడలి వద్ద ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

న్యూస్ బాక్స్

రుణాల మంజూరుకు మార్గం సుగమం



ఏపీఎం, సీసీని సన్మానిస్తున్న నాయకులు

బెళుగుప్ప, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రవితేజ మండల సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలోని 11,108 స్వయం సహాయక సంఘాలకు సర్ప్ రుణాలు ఇవ్వడానికి అంగీకరించినట్లు వెలుగు ఏపీఎం సురేఖ, సీసీ మంజునాథ్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో 'మన డబ్బులు మన లెక్కలు'పై సభ్యులకు వారు గురువారం అవగాహన కల్పించారు. సంఘసభ్యుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని వెలుగు సిబంది, గత ప్రభుత్వ నాయకులు నిధులను కాజేశారు. బకాయిలు చెల్లించకపోవడంతో సర్ప్ స్త్రీనిధి రుణాలు మంజూరును నిలిపివేసింది. దీంతో ఈ సంఘాలకు ఐదేళ్లుగా రుణాలు మంజూరు కాకపోవడంతో ఆ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సమస్యను పరిష్కరించాలని మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఇటీవల ఆదేశించారు. దీంతో ఏపీఎం, సీసీ ప్రత్యేక చొరవతో కొంత మేర డబ్బులను రికవరీ చేశారు. దీంతో ఆ సంఘాలకు మళ్లీ రుణాలు ఇవ్వడానికి సర్ప్ అంగీకరించింది. ఈ నేపథ్యంలో సంఘం సభ్యులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమస్యను పరిష్కరించిన ఏపీఎం, సీసీని టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఎంపీపీ పెద్దన్న, రవితేజ, మండల సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యమ్మ, గీత సన్మానించారు.

ఖనిజ తవ్వకాలపై అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న ఆర్డీఓ

గుత్తి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులో ఖనిజ తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని అదే గ్రామ సమీపంలో గురువారం నిర్వహించారు. సర్వే నంబరు 644లోని 12 హెక్టారులో ఖనిజ తవ్వకాలు చేస్తారని, దీనిపై ప్రజలు అభిప్రాయాన్ని తెలపాలని ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దారు పుణ్యవతి కోరారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని గ్రామస్థులు కోరారు. పంట పొలాలకు నష్టం జరగకపోతే తమకు అభ్యంతరం లేదని రైతులు అన్నారు. నారాయణస్వామి షిర్డీసాయి మినరల్స్ ప్రతినిధులు మాట్లడుతూ.. స్థానిక స్కిల్ లేబర్లను పనిలోకి తీసుకుంటామని హామీఇచ్చారు. గ్రామాలాభివృద్ధికి తమ వంతుగా సహకరిస్తామని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రతాప్, ఎంపీటీసీ నారాయణస్వామి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముప్పు

- పెరిగిన పాములు, విషపురుగుల సంచారం
- తక్షణ వైద్యంతోనే ప్రాణాలకు రక్ష



కళ్యాణదుర్గం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వానా కాలంలో అనేక రకాల విషపురుగులు, పాముల సంచారం పెరిగింది. దీంతో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతోంది. కొన్ని రోజులుగా వ్యవసాయ పనులకు వెళ్లిన వారు పాముకాటుకు గురవుతున్నారు. ఈనేపథ్యంలో పొలం పనికి వెళితే ఏవైపు నుంచి ఎలాంటి పాము కాటుకు గురికావాల్సి వస్తుందోనని రైతులు, కూలీలు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మూడేళ్లుగా పరిశీలిస్తే 2023లో 95 మంది, 2024లో 110 మంది, 2025లో ఇప్పటిదాకా 128 మంది పాముకాటుకు గురైనట్లు వైద్య గణాంకాలు చెబుతున్నాయి. తక్షణ వైద్య సేవలు పొందడం ద్వారా ప్రాణపాయం నుంచి తప్పించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పాముకాటుకు యాంటీ వీనమ్ మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.

● **కాటేస్తే ఇలా చేయాలి**: పాము, ఇతర ఏ విషపురుగు కాటు వేసినా వెంటనే బాధితులను ఆస్పత్రికి తరలించాలి. నాటు వైద్యం, మంత్రాలు, తంత్రాలు అంటూ కాలయాపన చేయరాదు. కాటు వేసిన ప్రాంతాన్ని కాల్చరాదు. సబ్బుతో శుభ్రంగా కడగాలి. బాధితుడిని కంగారు పెట్టకుండా పడుకోబెట్టి.. వెంటనే ఆసుపత్రికి తరలించారు. కాటు వేసింది ఏ జాతి విషపురుగో తెలిస్తే అందుకు అనుగుణంగా విరుగుడు వైద్యం చేయడానికి వీలుంటుంది.

అందుబాటులో వ్యాక్సిన్

పాముకాటుకు సంబంధించి విరుగుడు మందులు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. బాధితులను ఆస్పత్రికి తీసుకొస్తే పరీక్షించి మందులు వేస్తున్నాం. బాధితుడి పరిస్థితి బాగాలేకపోతే వెంటనే జిల్లా కేంద్రానికి రెఫర్ చేస్తున్నాం.

-ప్రసన్న భారతి, వైద్యాధికారి, కళ్యాణదుర్గం

రైతులకు జింకల దడ



ఎర్రగుడి వద్ద పప్పుశనగను మేస్తున్న జింకలు

బెళుగుప్ప, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులను జింకల బెడద పట్టి పీడిస్తోంది. మండలంలో 15 వేల ఎకరాలకు పైగా ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సాగు చేసుకోవచ్చు. జింకల భయంతో రైతులు వెనుకంజ వేస్తున్నారు. వీటి బెడదతో ఒక్క పంట మాత్రమే అతికష్టమ్మీద సాగుచేసుకునే దుస్థితి నెలకొంది. వర్షాకాలానికి ముందుగానే ముంగారు పంటలు కొర్ర, ధనియాలు, ప్రొద్దుతిరుగుడు, వేరుశనగ పంటలు సాగు చేసుకోవచ్చు. అయితే ఈ పంటలు వేసుకుంటే జింకలు వాటిని నాశనం చేస్తాయి. పొలాల్లో ఎక్కడ చూసినా జింకల మందలే కనిపిస్తాయి. ఒక్కొక్క మందలో సుమారు అరవైదాకా ఉంటాయి. వాటి జోలికెళితే కేసులు పెడతారనే భయం.. ఊరకుంటే పంట నాశనం నాశనం చేస్తాయనే బెంగ. ఎటూ పాలుపోక దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. జింకల బెడద తప్పించేలా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాగు చేయడమే మానేశాం



గతంలో మా పెద్దలు ముంగారు పంటలు సాగుచేసేవారు. ప్రస్తు తం జింకల బెడదతో అన్ని మానేశాము. గుంపులు.. గుంపులుగా జింకలు వచ్చి పంటలను నాశనం చేస్తున్నాయి. పది ఎకరాలలో పప్పుశనగ సాగుచేశాను. జింకల బెడదతో దిక్కుతోచడం లేదు. దీంతో సాగుకు అవకాశమున్నా సద్వినియోగం చేసుకోలేకపోతున్నాం.

-ఓబయ్య, రైతు, ఎర్రగుడి

సమస్యలు అప్‌గ్రేడ్

తరగతి గదుల కొరతతో ఇబ్బందులు



చదంగొల్లలదొడ్డి గ్రామంలో చెట్టు కింద నిర్వహిస్తున్న తరగతి

రాయదుర్గం రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో చదంగొల్లలదొడ్డి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఈ సంవత్సరం పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేశారు. అయితే అందుకు తగ్గ సౌకర్యాలను కల్పించడంపై అధికారులు, పాలకులు నిర్లక్ష్యం చూపారు. ఈ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 478 మంది విద్యార్థులు ఉన్నారు. 18 గదులు అవసరం కాగా.. కేవలం నాలుగు గదులే ఉన్నాయి. గదుల కొరతతో చెట్ల కింద, వరండాలో తరగతులను నిర్వహిస్తున్నారు. దీంతో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే ఇక పరిస్థితి మరీ ఘోరం. గదుల సమస్య పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై హెచ్‌ఎం వెంకటరమణను వివరణ కోరగా.. ప్రభుత్వం అదనపు గదులను నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

మంత్రి నారా లోకేశ్‌కు ఘన స్వాగతం పలుకుదాం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు ధర్మతేజ

కళ్యాణదుర్గం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఘన స్వాగతం పలికేందుకు సంసిద్ధం కావాలని టీడీపీ నాయకులు ధర్మతేజ పిలుపునిచ్చారు. గురువారం కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రజావేదిక, కంబదూరు మల్లేశ్వరస్వామి ఆలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీఎత్తున మహిళలు కలశాలతో స్వాగతం పలికేందుకు ముందుగా సిద్ధం చేసుకోవాలన్నారు. సమష్టిగా ఈ రెండు రోజుల కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేసేందుకు దిశానిర్దేశం చేశారు.

వాటర్ షెడ్ పనులకు శ్రీకారం



వాటర్ షెడ్ పనులను ప్రారంభిస్తున్న పీడీ

కూడేరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పేరులో వాటర్ షెడ్ కింద మంజూరైన నీటికుంట, చెక్‌డ్యాం నిర్మాణ పనులను డ్వామా పీడీ సలీమ్‌బాషా గురువారం ప్రారంభించారు. గ్రామ సమీపంలోని శైలాద్రి పొలం వద్ద రూ. 7.50 లక్షలతో నీటికుంట, రూ, 6.50 లక్షలతో చెక్‌డ్యాం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందులో అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఏపీఓ పోలేరయ్య, పీఓ ఈశ్వరయ్య, వాటర్ షెడ్ ఛైర్మన్ వెంకటరాముడు, ఫీల్డ్ అసిసెంట్ సంగప్ప పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలతో వీఆర్‌కు

నెలలో ఇద్దరు సీఐలు, ఒక ఎస్ఐ



డీఎస్పీ రవిబాబు

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలతో కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పోలీస్ శాఖలో వీఆర్ పర్వం కొనసాగుతోంది. నియోజకవర్గంలో ఇటీవల ఇద్దరు సీఐలు, ఒక ఎస్ఐని వీఆర్‌కు పంపడం తీవ్ర చర్చకు దారి తీసింది. పట్టణ సీఐ యువరాజు ఆది నుంచి ధనార్జనే ధ్యేయంగా అనేక వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. సివిల్ కేసు విషయంలో రూ. మూడు లక్షలు ముడుపులు అందినట్లు ఆరోపణలు వచ్చాయి. అలాగే రూరల్ సీఐతో పాటు ఇద్దరు కానిస్టేబుల్, ఒక హోంగార్డుని ఉపయోగించుకుని ఇష్టరాజ్యంగా వ్యవహరించినట్లు సమాచారం. వారి వల్ల రూరల్ పరిధిలోని గ్రామీణులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. సమస్యలతో రూరల్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో ఏమీపట్టనట్లుగా వ్యవహరించిన ఆ సీఐ తీరు పట్ల ప్రజలు తీవ్ర అసహనంతో ఉన్నారు. రూరల్ పరిధిలో మట్కా, పేకాట, నాటుసారా తదితర అసాంఘీక కార్యక్రమాలపై కూడా చూసీచూడనట్లుగా వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి. రూరల్ పరిధిలోని గ్రామాలలో కిందిస్థాయి సిబ్బందిని ఉపయోగించుకుంటూ అందిన కాటికి దోచుకో, చూసీచూడనట్లు వ్యవహరించు అనే రీతిలో ఆ సీఐ వ్యవహరించినట్లు సమాచారం. పొలాల్లో విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర వ్యవసాయ పనిముట్లు దొంగతనాలపై రైతులు ఫిర్యాదు చేసిన నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఆ ఎస్ఐ తీరును విమర్శిస్తూ సోషల్ మీడియాలో అనేక వార్తలు హల్‌చల్ చేశాయి. సమస్య పై ఫిర్యాదు చేస్తే కనీసం విచారణ కూడా చేయకుండా కాలయాపన చేశారని పలువురు బాధితులు వాపోయిన సందర్భాలు అనేకం. పొలాలలో దొంగతనాలు జరిగిన వీడియోలు, ఫోటోలు సహా ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలూ తీసుకోక పోగా వాటిని నీరుగారుస్తారనే ఆరోపణలున్నాయి. ఎట్టకేలకు ఇటువంటి అధికారులను వీఆర్‌కు పంపడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీఆర్‌ల పర్వంపై డీఎస్పీ రవిబాబును వివరణ కోరగా.. అవినీతి ఆరోపణల నేపథ్యంలో వీఆర్‌కు పంపడం కాదని, అది అడ్మినిస్ట్రేషన్‌లో భాగంగా జరిగినదే అని స్పష్టం చేశారు.

ముళ్లకంపల్లో ట్రాన్స్‌ఫార్మర్



ముళ్లకంపల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

బొమ్మనహాళ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుదేవనహళ్లి గ్రామ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ భారీగా ముళ్లకంపలు పెరిగాయి. దానికి సమీపంలోని ఓ విద్యుత్ స్తంభానికి పిచ్చి తీగలు అల్లుకున్నాయి. వర్షాలు పడుతున్న ఈ తరుణంలో ప్రమాదం జరిగే అవకాశముందని ఆ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ ముళ్లచెట్లను, తీగలను తొలగించాలని లైన్‌మన్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై బొమ్మనహాళ్ ఏఈఈ లక్ష్మిరెడ్డిని వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి రాలేదని, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ముళ్లకంపలు తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కూటమితోనే పంచాయతీల అభివృద్ధి: ఎమ్మెల్యే



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో పంచాయతీల అభివృద్ధికి కేవలం రూ. 200 కోట్లు ఇస్తే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదహారు నెలల్లోనే రూ. 1200 కోట్లు మంజూరు చేసిందని, పంచాయతీల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యంచేస్తే.. కూటమి ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసి.. ఆ వ్యవస్థకు పూర్వవైభవం తెచ్చిందన్నారు. గురువారం స్థానిక ప్రజావేదికలో నియోజకవర్గంలోని పంచాయతీరాజ్ ఉద్యోగులతో కలిసి సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేసిన ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం పంచాయతీరాజ్ ఉద్యోగులను ఏ మాత్రం పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం వారికి ఉద్యోగోన్నతులు ఇచ్చిందని, పంచాయతీ కార్యదర్శులను పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారిగా గుర్తింపు ఇచ్చిందని అన్నారు. కావున పంచాయతీరాజ్ అధికారులు ప్రజా సమస్యలు పరిష్కరించి.. అభివృద్ధికి బాటలు వేయాలన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



తాడిపత్రి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ గుంతకల్లు సమీపంలోని కొనగుండ్లలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో తాడిపత్రి క్రీడాకారులు గురుసాయి, అవనిక, అర్షియ, నవ్య, చాందిని, అయిషా ప్రతిభచాటారు. పులివెందులలో శుక్రవారం నుంచి నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ లక్ష్మీనరసింహ తెలిపారు.



భరత్‌కుమార్

● పుట్లూరు: అనంతపురం ఆర్డీటీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి భరత్ కుమార్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు..

రాయదుర్గంరూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈ నెల 4న నిర్వహించిన నెట్‌బాల్ క్రీడా పోటీలో మండలంలోని వడ్రవన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కే కార్తీక్, సరిత, మోక్షిత్, హర్షిత ప్రతిభచాటారు. వీరు ఈ నెలలో విజయవాడ, ఏలూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

● గుమ్మఘట్ట :జిల్లాస్థాయిలో బుధవారం జరిగిన నెట్‌బాల్ పోటీల్లో పూలకుంట హైస్కూల్ విద్యార్థులు సునీత, వడ్డే కార్తీక్, మునీశ్వర్, కల్పన, హరికృష్ణ, ధనుంజయ ప్రతిభచాటి రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపికయ్యారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

శెట్టూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జీఎఫ్ స్కూల్ గేమ్స్ కళ్యాణదుర్గం డివిజనల్ స్థాయి అండర్ 14 వాలీబాల్ పోటీలు గురువారంతో ముగిశాయి. బాలుర విభాగంలో కంబదూరు మండలం, బాలికల విభాగంలో హిరేహాళ్ జట్లు విజేతలుగా నిలిచాయి. ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జిల్లాస్థాయికి ఎంపికచేశారు. ఇందులో గుత్తి డివిజనల్ డిప్యూటీ ఉప విద్యాశాఖాధికారి పాటిల్ మల్లారెడ్డి, శెట్టూరు మండల విద్యాధికారి శ్రీధర్, వాణిదేవి, డివిజనల్ కో-ఆర్డినేటర్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చెరువు, కాలువ పరిశీలన

యాడికి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాయలచెరువులోని చెరువును, యాడికి కాలువను హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రాయలచెరువు నిండిందని, యాడికి కాలువకు నీటిని విడుదల చేశామని తెలిపారు. యాడికి కాలువకు నీటిని విడుదల చేసే కిష్టిపాడు హెడ్ రెగ్యులేటరీ వద్ద గేట్లకు మరమ్మతులు చేపట్టాలని పలువురు రైతులు ఆయన్ను కోరారు. ఆయన వెంట హెచ్చెల్సీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈలు అరుణకుమారి, రాధాకృష్ణ, ఏఈలు చెన్నారెడ్డి, కిరణ్, శ్రీలత, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, మాజీ సర్పంచు గోపాల్‌నాయుడు, టీడీపీ నాయకుడు రవికుమార్‌రెడ్డి ఉన్నారు.

ట్రాఫిక్ పోలీసులను నియమించండి

తాడిపత్రి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రధాన కూడళ్లల్లో ట్రాఫిక్ పోలీసులను నియమించాలని ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరిని సీపీఐ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఇందులో సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్, నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

రాయదుర్గంరూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని విప్ కాలవ శ్రీనివాసులు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ కురుబ హనుమంతు పేర్కొన్నారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

యల్లనూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ పద్మనాభరెడ్డి తెలిపారు. మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను బంద్ చేస్తున్నట్లు చెప్పారు.

క్రైం న్యూస్..

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని చల్లవారిపల్లి-యల్లనూరు రోడ్డు మార్గమధ్యలో గుర్తుతెలియని వ్యక్తి (35) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వరప్రసాద్ గురువారం తెలిపారు. మృతునికి దాదాపు 35 సంవత్సరాలు ఉంటాయని, ఇతని వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు.

వెంగన్నపల్లి గొడవలో కేసు నమోదు

యాడికి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగన్నపల్లిలో బుధవారం రాత్రి జరిగిన గొడవకు సంబంధించి టీడీపీకి చెందిన ఏడుగురు, వైసీపీకి చెందిన ఏడుగురు.. మొత్తం 14 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. వీరిలో వైసీపీకి చెందిన నంద్యాల రాజారెడ్డి, నాగభూషణరెడ్డిని అరెస్ట్ చేశామన్నారు.

భర్తపై దాడి

తాడిపత్రి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక నంద్యాలరోడ్డు గణేషనగర్‌లో కుళ్లాయప్ప, ఇస్లాత్ నివాసముండేవారు. వీరికి రెండేళ్ల కిత్రం వివాహమైంది. కొంతకాలం నుంచి మనస్పర్థలు రావడంతో గురువారం ఇస్లాత్ స్థానిక యల్లనూరు రోడ్డులోని తన పుట్టింటికి వచ్చింది. కుళ్లాయప్ప అత్త ఇంటికి వచ్చి నానా దుర్భాషలాడుతూ.. అక్కడే ఉన్న కట్టె తీసుకొని మామ గఫూర్‌పై దాడి చేసేందుకు యత్నించాడు. దీంతో ఇస్లాత్ కట్టెతో భర్తపై దాడిచేయడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. విచారించి కేసు నమోదు చేస్తామని పట్టణ సీఐ ఆరోహణరావు తెలిపారు.

బ్యాంక్ మేనేజర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు

తాడిపత్రి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇండియన్ బ్యాంక్ మేనేజర్ అస్లాంపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఆరోహణరావు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ రుణం కోసం బ్యాంక్ వెళ్లగా బ్యాంక్ మేనేజర్ తనను దుర్భాషలాడినట్లు మండలంలోని గోసువారిపల్లికి చెందిన నందకుమార్ గురువారం ఫిర్యాదు చేశారని, దీంతో అస్లాంపై కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



గుత్తి : బాలుడిని అప్పగిస్తున్న పోలీసులు

గుత్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కటిక వీధికి చెందిన ఎక్కాల కుమార్ తనయుడు వర్షిత్ ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. బుధవారం సా యంత్రం ఇంటి నుంచి వెళ్లిన వర్షిత్ తిరిగి రాలేదు. కుటుం బసభ్యులు గాలించినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కర్నూలు రోడ్డులో ఆ బాలుడు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. అతన్ని స్టేషన్‌కు తీసుకొని వచ్చి.. తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ రామారావు, ఎస్ఐ సురేష్, పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



గుంతకల్లు : బాలుడిని అప్పగిస్తున్న సీఐ

● గుంతకల్లుటౌన్ : స్థానిక పాత గుంతకల్లులోని వాల్మీకి సర్కిల్‌లో నివాసముంటున్న రోశయ్య, రేణుకా కుమారుడు జగదీష్ గురువారం తప్పిపోయాడు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో మానసిక దివ్యాంగుల పాఠశాలకు వెళ్లిన ఆ బాలుడు.. మధ్యాహ్నం అక్కడ భోజ నం చేసి బయటకు వచ్చేశాడు. ఆ బాలుడు మస్తానయ్య దర్గా వద్ద తిరుగుతుండగా స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ బాలుడిని స్టేషన్‌కు తీసుకొచ్చి.. బాధిత తల్లిదండ్రులకు సమాచారం అందించారు. స్టేషన్‌కు వచ్చిన వారికి ఆ బాలుడిని సీఐ మస్తాన్ అప్పగించారు.

నేటి నుంచి ఉరుసు



సయ్యద్ శర్మస్‌వలి సమాధి

బొమ్మనహాళ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహొన్నూరులో సయ్యాద్ శర్మస్‌వలి చిష్తి 347 ఉరుసు ఉత్సవాలను శుక్రవారం నుంచి మంగళవారం వరకు నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు గురువారం తెలిపారు. శుక్రవారం గంధం, శనివారం దీపారాధన, ఆదివారం రెండో దీపారాధన, సోమవారం ఉరుసు షరీఫ్ (గుర్రం సవారీ), మంగళవారం జియారత్ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

వీధిరోడ్లకు మరమ్మతులు



రోడ్డు మరమ్మతులు చేయిస్తున్న నాయకులు

విడపనకల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాళాపురం గ్రామంలో పలు వీధుల్లోని మట్టిరోడ్లు దెబ్బతిన్నాయి. వీధిదీపాలూ లేవు. సమస్యలను ఆ గ్రామస్థులు మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ సీనియర్ నాయకుడు పయ్యావుల శ్రీనివాసుల దృష్టికి ఇటీవల తీసుకెళ్లారు. దీంతో వారి ఆదేశాల మేరకు గ్రామ టీడీపీ నాయకులు ఆ గ్రామంలోని రోడ్లపై గురువారం మట్టి తోలించారు. వీధి దీపాలను ఏర్పాటు చేయించారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

ఉరవకొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆదినారాయణ, అధ్యాపకులు రాజేష్, నారాయణస్వామి, కృష్ణవేణి, సిరాజ్ అలీఖాన్ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు





గజగౌరీదేవికి చక్కెర హారతులు

బొమ్మనహాళ్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంతకల్లు, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ తదితర గ్రామాల్లో గజగౌరీదేవికి మహిళలు గురువారం రాత్రి భారీ ఎత్తున చక్కెర హారతులు ఇచ్చారు. గ్రామాల్లోని మండపాలలోనూ, దేవాలయం వద్ద ప్రతిష్ఠించిన గజగౌరీదేవికి నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, ఒడిబియ్యం సమర్పించారు.





ఉరవకొండ, విడపనకల్లులో అమ్మవారి అలంకరణ

● కణేకల్లు : స్థానిక బీరప్ప గుడి వద్ద గౌరీదేవి విగ్రహాన్ని గురువారం ప్రతిష్ఠించారు. గజగౌరీ ఉత్సవాల్లో భాగంగా వేదావతి హగరి నుంచి గంగాజలాన్ని తెచ్చి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

● ఉరవకొండ : స్థానిక 13వ వార్డులో కడ్లే గౌరమ్మ ఆలయంలో ఉత్సవాలను గురువారం ప్రారంభించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవాలను నాలుగు రోజుల పాటు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యుడు విజయ్ కుమార్ తెలిపారు.

● విడపనకల్లు : స్థానిక కడ్లే గౌరమ్మ ఆలయంలో గురువారం కడ్లే గౌరమ్మను ప్రతిష్ఠించారు.